

కార్యకర్తలే టీడీపీ బలం

మీ సేవలను ఎన్నటికీ మరువం

- గ్రూపు రాజకీయాలు, అలకపాన్పులు వద్దు
- కష్టపడ్డ అందరికీ న్యాయం చేస్తాం
- నీరు-చెట్టు పెండింగ్ బిల్లులు తీసేసుకోండి
- కేసులపై ప్రత్యేక సెల్‌కు ఫిర్యాదు చేయండి
- విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్
- గుంతకల్లు నియోజకవర్గ కార్యకర్తలతో సమావేశం



ప్రసంగిస్తున్న మంత్రి లోకేశ్, హాజరైన కార్యకర్తలు



అనంతపురం, గుంతకల్లు/గుత్తి, మే 15(ఆంధ్రజ్యోతి): కార్యకర్తల బలంపైనే టీడీపీ నిలిచి ఉందని, ఏ కార్యకర్తనూ మరచిపోమని విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. గుత్తి పట్టణ శివారులో గురువారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకూ మంత్రి నారా లోకేశ్ నియోజకవర్గ కార్యకర్తల సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. మధ్యాహ్నం హెలీకాప్టర్‌లో గుత్తికి వచ్చిన ఆయన, తొలుత ఉత్తమ కార్యకర్తలతో సమావేశమయ్యారు. అత్యుత్తమ చొరవ, నిబద్ధత చూపిన 32 మంది కార్యకర్తలకు ప్రశంసా పత్రాలు, గౌరవ పురస్కారాలను అందజేశారు. కార్యకర్తల పోరాటం ఫలితంగానే వైసీపీ దుష్టపరిపాలన నుంచి రాష్ట్రాన్ని కాపాడగలిగామని అన్నారు. వైసీపీ పాలనలో ప్రజలు కష్టాలను చవిచూస్తే, టీడీపీ శ్రేణులు నరకాన్ని అనుభవించారని అన్నారు. కష్టపడి సాధించిన ఈ విజయాన్ని పదిలపరుచుకోవాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందని అన్నారు. రానున్న రోజుల్లో సమష్టిగా ముందుకెళ్లాలని, గ్రూపు రాజకీయాల జోలికి వెళ్లరాదని, అలిగి ఇంటివద్ద కోర్చోవద్దని కార్యకర్తలకు హితవు పలికారు. గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంతో దారిలో మాట్లాడానని, కార్యకర్తల్లో ఎవరికీ అన్యాయం జరగదని, ఆయన అందరికీ న్యాయం చేస్తారని తెలిపారు. ఎమ్మెల్యే వద్దకు ఎటువంటి అరమరికలూ (మిగతా 8లో...)

ప్రాజెక్టుల కోసం భూసేకరణ: కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్

పుట్టపర్తి టౌన్, మే 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇంధన ప్రాజెక్టుల స్థాపనకు అవసరమైన భూసేకరణ వెంటనే చేపట్టాలని కలెక్టర్ టీఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టరేట్ అభిషేక్‌కుమార్‌తో కలిసి గురువారం ఆయన ఇంధన ప్రాజెక్టుల స్థాపన, భూసేకరణాంశాలపై అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 4వేల మెగావాట్ల పునర్వృదాక ఇంధన ప్రాజెక్టుల స్థాపనకు అవసరమైన భూమిని సేకరించాలని ఆర్డీవోలు, తహసీల్దార్లను ఆదేశించారు. రైతుల నుంచి సేకరించిన పట్టా భూములకు ఎకరాకు ఏడాదికి రూ.31వేలు చొప్పున ప్రభుత్వం లీజ్ రూపంలో చెల్లిస్తుందన్నారు. జిల్లాలోని స్థానిక ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేల సహకారంతో అధికారులు ఈభూసేకరణ చేపట్టాలని సూచించారు. ఈనెల 20లోపు భూసేకరణ జాబితా సిద్ధం చేయాలన్నారు. ఇంధన ప్రాజెక్టుల స్థాపన కోసం జిల్లాలోని ముదిగుబ్బ, తలుపుల, రొద్దం, గుడిబండ, కనగానపల్లి, చిలమత్తూరు, హిందూపురం, అగళి, రామగిరి మండలాల్లో భూసేకరణ చేపటనున్నట్లు చెప్పారు. సమావేశంలో ఆర్డీవోలు వీవీఎస్ శర్మ, మహేష్, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్రను విజయవంతం చేయాలి

ఈనెల 17న మూడో శనివారం చేపట్టనున్న స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. స్వచ్ఛాంధ్ర కార్యక్రమంపై ముందస్తు ఏర్పాట్లను గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ సమీక్షించారు. కార్యక్రమంలో భాగంగా వడగాడ్పులపై ప్రజలకు అవగాహన కల్పించడానికి సదస్సులు నిర్వహించాలన్నారు.

నేడు జిల్లాకు మంత్రి నిమ్మల రాక

రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు శుక్రవారం జిల్లా పర్యటనకు రానున్నట్లు కలెక్టర్ గురువారం ఓప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 1గంటలకు ముదిగుబ్బ మండలంలోని మలకవేమల వద్ద హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులను మంత్రి పరిశీలిస్తారన్నారు. మంత్రి నిమ్మలతోపాటు జిల్లా మంత్రులు సత్యకుమార్ యాదవ్, సవిత కూడా కార్యక్రమంలో పాల్గొంటారన్నారు.

సార్..! కనికరించండి

- రోడ్డు ప్రమాదంలో మంచం పట్టిన టీడీపీ కార్యకర్త
- వైకల్య ధ్రువీకరణ పత్రం కోసం బాధితుడి ఎదురుచూపు

(వివరాలు 8వ పేజీలో..)





అవిశ్వాస తీర్మానానికి మద్దతు తెలుపుతున్న కౌన్సిలర్లు



అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో విక్టరీ గుర్తును చూపుతున్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ, కౌన్సిలర్లు

నెగ్గిన అవిశ్వాసం

మడకశిర నగర పంచాయతీని కోల్పోయిన వైసీపీ

సంబరాలు చేసుకున్న టీడీపీ కార్యకర్తలు
వరుస దెబ్బలతో నైరాశ్యంలో జగన్ పార్టీ శ్రేణులు

మడకశిర/టౌన్, మే 15(ఆంధ్రజ్యోతి): మడకశిర నగర పంచాయతీలో గురువారం ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. దీంతో చైర్‌పర్సన్ లక్ష్మీ నరసమ్మ, వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డి తమ పదవులు కోల్పోయారు. ఉదయం 11గంటలకు ఎన్నికల అధికారి ఆనంద్‌కుమార్ అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు, మడకశిర నగర పంచాయతీ పరిధిలో మొత్తం 20వార్డులు 20 మంది కౌన్సిలర్లు ఉండగా అవిశ్వాస తీర్మానానికి 14 మంది కౌన్సిలర్లు హాజరయ్యారు. ఎక్స్ అఫిషియో సభ్యుడితో కలిపి టీడీపీ బలం 15కు చేరింది.

దీంతో అవిశ్వాస తీర్మానం నెగ్గినట్లు ఎన్నికల అధికారి ఆనంద్‌కుమార్ ప్రకటించారు. ప్రస్తుత చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డితో పాటు మరో నలుగురు వైసీపీ కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానానికి గైర్హాజరయ్యారు. అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో మూడు నెలల్లో మడకశిర నగర పంచాయతీకి కొత్త చైర్మన్, వైస్ చైర్మన్‌ల ఎన్నిక జరగనుంది. అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో టీడీపీ శ్రేణులు పెద్ద ఎత్తున బాణసంచా పేల్చి సంబరాలు జరుపుకొన్నారు. స్వీట్లు పంచి పెట్టారు.

వైసీపీ విప్ కూడా టీడీపీకే మద్దతు

మడకశిర 20వ వార్డు కౌన్సిలరు సిద్దప్ప వైసీపీకి విప్‌గా ఉండి గురువారం జరిగిన అవిశ్వాస తీర్మానానికి మద్దతుగా నిలిచారు. ప్రత్యేక కౌన్సిల్ సమావేశానికి వైసీపీకి చెందిన కౌన్సిలర్లు ఎవరూ హాజరు కాక పోయినా సిద్దప్ప హాజరై తాను అవిశ్వాసానికి మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు. ఇది వైసీపీకి ఊహించని షాక్ ఇచ్చింది.



ఎన్నికల అధికారిగా హాజరైన ఆర్డీఓ ఆనంద్‌కుమార్

అభివృద్ధి కోసమే..

మడకశిర ఎమ్మెల్యేగా ఎంఎస్‌రాజు గెలిచినప్పటి నుంచి మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామితో కలిసి నగర పంచాయతీని అభివృద్ధి కి కృషి చేస్తున్నారు. అభివృద్ధికి అండగా నిలవాలన్న తలంపుతో పలువురు వైసీపీ కౌన్సిలర్లు టీడీపీ వైపు మొగ్గారు. వైసీపీ పాలనలో తామ వార్డుల్లో ఎలాంటి అభివృద్ధి జరగలేదని, అందుకే తాము టీడీపీకి మద్దతు తెలుపుతున్నట్లు పలువురు కౌన్సిలర్లు బహిరంగంగానే పేర్కొన్నారు. నగర పంచాయతీ ఎన్నికల్లో టీడీపీ తరఫున ఐదుగురే కౌన్సిలర్లుగా గెలిచారు. అయితే సార్వత్రిక ఎన్నికల అనంతరం టీడీపీలోకి ఏడుగురు వైసీపీ కౌన్సిలర్లు చేరారు. మరో కౌన్సిలరు కూడా టీడీపీకి మద్దతు ఇచ్చారు. దీంతో 13 మంది కౌన్సిలర్లు చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు.

వైసీపీకి గట్టి దెబ్బ

మడకశిర నియోజకవర్గంలో వైసీపీకి ఇటీవల గట్టి దెబ్బలు తగులుతున్నాయి. ఇప్పటికే పలువురు ఎంపీపీలు, జడ్పీటీసీ సభ్యులతో పాటు అనేక మంది పార్టీ మారారు. ఇప్పుడు నగర పంచాయతీని కోల్పోవడంతో పార్టీలో నైరాశ్యం అలముకుంది. నియోజకవర్గంలో పార్టీని నడిపే నాయకుడు లేక, కార్యకర్తల కష్టాలు పట్టించుకొనే వారు లేక పార్టీ కార్యకర్తలు పూర్తిగా డీలా పడ్డారు.

కలెక్టర్‌కు నివేదిస్తాం

- ఆనంద్‌కుమార్, ఆర్డీఓ

మడకశిర నగర పంచాయతీలో గురువారం అవిశ్వాస తీర్మానం నెగ్గినట్లు జిల్లా కలెక్టర్‌కు నివేదకి సమర్పిస్తామని ఎన్నికల అధికారి, పెనుకొండ ఆర్డీఓ ఆనంద్‌కుమార్ తెలిపారు. మడకశిర నగర పంచాయతీ కమిషనర్ రంగస్వామితో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. మొత్తం 20మంది కౌన్సిలర్లు ఉండగా అవిశ్వాస తీర్మానం కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సమావేశానికి 14 మంది సభ్యులు హాజరయ్యారు. కోరం ఉండటంతో ఎన్నిక నిర్వహించి నట్లు తెలిపారు. ఎక్స్ అఫిషియో సభ్యుడితో కలిసి 21 మంది ఉండగా అందులో 15 మంది అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా ఓటు వేసినట్లు తెలిపారు. కలెక్టర్ ఆదేశాలకు అనుగుణంగా తదుపరి చర్యలు ఉంటాయని తెలిపారు.

ఉరుములు, మెరుపులతో భారీ వర్షం

పొంగిపొర్లిన చెక్‌డ్యాంలు, పారిన వంకలు
ధర్మవరంలో 71.6 మి.మీ. వర్షపాతం నమోదు



చిగిచెర్ల వద్ద పొంగిపొర్లుతున్న చెక్‌డ్యాం

ధర్మవరం రూరల్, మే 15(ఆంధ్రజ్యోతి): మండలవ్యాప్తంగా బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం తెల్లవారుజాము వరకు ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. సాయంత్రం వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఎండతీవ్రత, ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలకు ఈ భారీ వర్షం ఉపశమనం కలిగించింది. భారీ వర్షం కురవడంతో పలు గ్రామాల్లో చెక్‌డ్యాంలు పొంగి పొర్లాయి. వాగులు, వంకల్లో ఎర్రనీళ్ల పరవళ్లు తొక్కాయి. మండలంలో 71.6మి.మీల వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. చిగిచెర్ల, బిల్వంపల్లి, ఏలుకుంట్ల, వసంతపురం, చింతలపల్లి, కుణుతూరు, తదితర గ్రామాల్లో చెక్‌డ్యాంలు పొంగిపొర్లాయి. దీంతో ఆయా గ్రామాల్లో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ముంగారుకు ముందుగానే వర్షాలు కురవడం సేద్యాలకు, పంటల సాగుకు అనుకూలంగా ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు. (మరిన్ని వివరాలు 9లో...)

బాలికకు భరోసా



కిశోరి వికాసంపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

- కిశోరి వికాసం కింద ప్రత్యేక కార్యక్రమాలు
- 12 అంశాలపై అవగాహనకు చర్యలు

ధర్మవరం, మే 15(ఆంధ్రజ్యోతి): కౌమార దశకు చేరుతున్న బాలికలకు సమాజంలో ఆరోగ్య సమస్యలు, ఇతర ఒడిదుడుకులను ఎదుర్కోవడానికి కిశోరి వికాసం కార్యక్రమం ఎంతగానో దోహదపడుతోంది. ఎన్నో కలలతో, మనసులో మరెన్నో సందేహాలతో బాలికలు ఉంటారు. 12 ఏళ్ల నుంచి 18 వయసులోపు బాలికలు ఈ పరిస్థితిని ఎదుర్కొంటుంటారు. వారిలో శారీరక, మానసిక, మార్పులతో కూడిన ఈ దశ వారిని అనేక ఒత్తిళ్లకు లోనుచేస్తోంది. సరైన దిశలో వారికి మార్గదర్శకం లభించకపోతే భవిష్యత్తు అంధకారమయ్యే ప్రమాదం ఉంది.

సాంకేతిక యుగంలోనూ ఒత్తిళ్లు

స్మార్ట్‌ఫోన్, సోషల్ మీడియా, ఆన్‌లైన్ గేమ్స్ వల్ల పిల్లలు వాస్తవ జీవితం నుంచి దూరం జరుగుతున్నారు. ఫలితంగా ఒంటరి తనంతోపాటు డిప్రెషన్, ఆత్మహత్య భావనలు వారిలో పెరుగుతున్నాయి. ఆహారపు అలవాట్లు మారడం, జంక్‌ఫుడ్ తీసుకోవడంతో పోషకాహార లోపాలు పెరుగుతున్నాయి. హీమోగ్లోబిన్ తక్కువ కావడం వల్ల రక్తహీనత పెరిగి బరువు తగ్గడం లాంటి సమస్యలు తలెత్తుతున్నాయి.

బాలికలే లక్ష్యంగా మోసాలు

ఇటీవల బాలికలే లక్ష్యంగా మోసాలు అధికమయ్యాయి. ప్రేమ పేరుతో కొందరు వారిని వంచిస్తున్నారు. మరికొందరు బాల్యవివాహాలు జరిపిస్తున్నారు. వీటిని అధిగమించేందుకు విద్య, నైపుణ్యం, ఎదుగుదల, పోటీతత్వం, వ్యక్తిగత శుభ్రత తదితర అంశాలపై 12 రోజుల్లో అవగాహన కల్పించేందుకు కిశోరి వికాసం పేరుతో ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా వేసవి శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తోంది.

బాల్య వివాహాలకు అడ్డుకట్ట పడేనా?

వేసవి సెలవుల్లో బాల్యవివాహాలు ఎక్కువగా జరుగుతుంటాయి. చిన్న వయసులోనే వివాహాలు చేయడం మూలంగా అనారోగ్య సమస్యలు, రక్తహీనత, ఇతర రుగ్మతలతో బలహీన సమాజానికి దారులు వేస్తున్నారు. తల్లిదండ్రుల్లో అవగాహన లేకపోవడం వల్ల ఈ తతంగం సాగుతోంది. బాల్యవివాహాలతో ఆరోగ్య సమస్యలు తలెత్తడమే కాకుండా వారికి పుట్టిన పిల్లలు బలహీనంగా జన్మిస్తారని వైద్యులు చెబుతున్నారు. బాల్యవివాహాలు చేసేవారిపై కేసు నమోదు చేసి, చట్టప్రకారం చర్యలు తీసుకుంటారు. ఎక్కడైనా, ఎవరైనా బాల్యవివాహం చేస్తున్నా, ప్రోత్సహిస్తున్నా 1098 టోల్ ఫ్రీ నంబరుకు ఫిర్యాదు చేయవచ్చు.

ఆత్మస్థైర్యం పెంపొందిస్తాం: శ్రీదేవి, పీడీ, ఐసీడీఎస్

వేసవి సెలవులను బాలికలకు ఉపయోగపడేలా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా వారిలో మార్పు తెచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు ఏదైనా సమస్య తలెత్తినపుడు పరిష్కరించుకునేలా వారిలో ఆత్మస్థైర్యం పెంపొందించేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.





మంత్రి లోకేశ్ ప్రసంగానికి హర్షం వ్యక్తం చేస్తున్న కార్యకర్తలు



దివ్యాంగుడి సమస్యలు ఆలకిస్తూ...

కార్యకర్తలే టీడీపీ బలం



మంత్రి లోకేశ్‌కు స్వాగతం పలుకుతున్న అనంతపురం కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ జగదీష్, జేసీ శివనారాయణశర్మ



ఉత్తమ కార్యకర్తలు వీరే..

(7వ పేజీ తరువాయి)

లేకుండా వెళ్లి పనులు చేయించుకోవాలని సూచించారు.

నెలలో 3 రోజులు పనిచేయండి..

పింఛన్ల పంపిణీ తదితర సంక్షేమ పథకాల అమలుపై కార్యకర్తలు ప్రత్యేక శ్రద్ధ చూపి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, నెలలో మూడు రోజులు ఇందుకు కేటాయించి పనిచేయాలని లోకేశ్ సూచించారు. పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, వారికి అందేలా చేస్తే విజయం మనదే అవుతుందని అన్నారు. పెండింగులో ఉన్న నీరు-చెట్టు బిల్లులను పొందాలని, వైసీపీ హయాంలో అక్రమంగా బనాయించిన కేసులపై వీలైతే స్థానికంగా పరిష్కరించుకోవాలని, లేదంటే విజయవాడలో ఏర్పాటుచేసిన కేసుల ప్రత్యేక విభాగంలో ఫిర్యాదు చేయాలని సూచించారు. సోలార్ ప్రాజెక్టులో స్థానిక యువతకు ఉద్యోగాలు వచ్చేలా చేస్తానని హామీ ఇచ్చారు.

ఐదేళ్లల్లో చేయలేనిది 11 నెలల్లో చేసి చూపించాం

'యువగళం పాదయాత్ర చేసినప్పుడు కార్యకర్తల అభీష్టం మేరకు కష్టపడిన కార్యకర్తలను గుర్తించేందుకే మీ ముందుకు వస్తున్నా' అని లోకేశ్ కార్యకర్తలకు స్పష్టం చేశారు. కార్యకర్తల పనితీరును టెక్నాలజీకి అనుబంధానం చేస్తే ఎవరు పనిచేస్తున్నారో తెలుస్తుందని ఆనాడే చెప్పానని అన్నారు. ఎవరు పనిచేస్తున్నారో స్పష్టంగా తెలుస్తోందని అన్నారు. ప్రభుత్వ కార్యక్రమానికి వచ్చే ముందు క్లస్టర్, గ్రామ, మండల నాయకులను కలుస్తానని చెప్పానని, అందుకే మెగా సోలార్ పార్క్ శంకుస్థాపనకు వచ్చే ముందే ఇక్కడికి వచ్చానని అన్నారు. ఐదేళ్లల్లో వైసీపీ ప్రభుత్వం చేయలేనిది.. 11 నెలల్లో చేసి చూపించామని అన్నారు. 'కరెంటు చార్జీలు పెంచమని చెప్పాం. జగన్ నిర్వాకం వల్లే ట్రూ అప్ చార్జీలు వేయాల్సి వస్తోంది. దీనిపై మనం మాట్లాడకపోతే దెబ్బతింటాం. 16,347 టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీ ఇచ్చాం. చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రానికి పెద్ద ఎత్తున కంపెనీలు వచ్చాయి. అనంతపురానికి రూ.22వేల కోట్ల విలువైన భారీ సోలార్, విండ్ ప్రాజెక్టు వస్తోంది. విశాఖకు టీసీఎస్ డెవలప్‌మెంట్ సెంటర్ వస్తోంది. రాబోవు ఐదేళ్లల్లో యువతకు ఉద్యోగాలు వస్తాయి' అని అన్నారు. పార్టీ కార్యకర్తలంతా ప్రభుత్వ పరంగా చేపట్టే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. అందరి కష్టంతో చరిత్రను తిరగరాశామని అన్నారు. పార్టీ ఆవిర్భావం తర్వాత ఎన్నడూ లేని విధంగా ప్రజలు కూటమికి 94 శాతం సీట్లు ఇచ్చారని అన్నారు. సునామీ మాదిరిగా ప్రజలు ఇచ్చిన తీర్పుతో చరిత్ర తిరగరాశామని, దీని వెనుక కార్యకర్తల కష్టం.. త్యాగాలు ఉన్నాయని అన్నారు. నాలుగున్నర దశాబ్దాల్లో అధికారం, ప్రతిపక్షం రెండు చూశామని అన్నారు. వైసీపీ అరాచక పాలన వంటిది ఇదివరకు ఎన్నడూ చూడలేదని అన్నారు. గతంలో చంద్రబాబు పరామర్శకు వెళితే ఆపే సాహసం ఎవరూ చేయలేదని అన్నారు. 2019 నుంచి 2024 వరకు భయానక పరిస్థితులు కల్పించారని అన్నారు. చంద్రబాబు బయటకు రావాలంటే ఇంటి గేటుకు తాళ్లు కట్టేశారని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు జరిగితే బీ ఫాంలను పట్టుకెళ్లారని, ఇళ్లు ధ్వంసం చేశారని అన్నారు. 'పుంగనూరులో అంజిరెడ్డి తాత మీసాలు మెలేసి, తొడ గొట్టి నామినేషన్ వేశారు. ఆయనే నాకు స్ఫూర్తి. పల్నాడులో మంజులారెడ్డి అనే తెలుగు మహిళ బూత్ ఏజెంట్‌గా ఉన్నందుకు కత్తులతో దాడి చేశారు. అయినా పోలింగ్ అయిపోయి, ఓటింగ్ మిషన్‌కు సీల్ వేసే వరకు అక్కడే ఉన్నారు. పల్నాడులో చంద్రయ్య మెడపై కత్తిపెట్టి జై జగన్ అనమంటే... జై చంద్రబాబు అన్నందుకు మెడకోసి హత్య చేశారు. ఐదేళ్ల రాక్షస పాలనలో అనేక కష్టాలు ఎదుర్కొన్న విషయాన్ని నేను ఎప్పటికీ మరిచిపోను' అని లోకేశ్ ఉద్వేగంగా అన్నారు.

రెడ్ బుక్ మరువను..

'పార్టీ కేడర్ ఎర్రబుక్కు గురించి అడుగుతున్నారు. మన కార్యకర్తలను ఇబ్బంది పెట్టిన వారిని వదలను. రెడ్ బుక్‌ను మరువను. నా అంతకు నేనుగా ఎవరితో గొడవ పెట్టుకోను. మన జోలికి వస్తే మాత్రం వదలను' అని లోకేశ్ అన్నారు. గత ప్రభుత్వంలో మద్యంలో ఎంత కుంభకోణం జరిగిందో రాష్ట్రం అంతా చూస్తున్నారని అన్నారు. ప్రజలను చైతన్యవంతులను చేసి, అక్రమార్కులపై చర్యలు తీసుకోవాల్సిందేనని, ఈ క్రమంలో కొంచెం సమయం పట్టొచ్చునని అన్నారు. కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్లి, వారి మధ్యనే గడపాలని సూచించారు. పార్టీ అధినేత తీసుకున్న నిర్ణయానికి అందరూ కట్టుబడి ఉండాల్సిందేని, కార్యకర్తల బాగు కోసమే తాను పనిచేస్తున్నానని అన్నారు. పార్టీలోనూ అదే నినాదాన్ని వినిపిస్తున్నానని అన్నారు. ఇది మన కుటుంబం.. మన పార్టీ, అన్యాయం జరిగితే తనను, పార్టీలోని ఇతర పెద్దలను కలవాలని సూచించారు. ఇన్‌చార్జి మంత్రి నెలకు ఒక సారి రావాలని ఇప్పటికే చెప్పానని అన్నారు. జోనల్ కో ఆర్డినేటర్, పార్లమెంట్ అధ్యక్షుడు అందుబాటులో ఉంటారని అన్నారు. 'సమస్యలపై నాలుగు గోడల మధ్య యుద్ధం చేద్దాంగాని.. బయటకు వస్తే మాత్రం జై తెలుగుదేశం అని నినదిద్దాం' అని కార్యకర్తల్లో భరోసానింపారు. త్వరలో మై టీడీపీ పేరుతో కొత్త యాప్‌ను తీసుకొస్తున్నామని, మహానాడు తర్వాత విడుదల చేస్తామని అన్నారు. అన్ని స్థాయిల్లోనూ అందరికీ ఒకే యాప్ ద్వారా కార్యక్రమాలపై సందేశాలు పంపిస్తామని అన్నారు. ఈనెల 18, 19, 20 తేదీల్లో నియోజకవర్గ స్థాయిల్లో మినీ మహానాడులను జరుపుకోవాలని సూచించారు. ఈనెల 27, 28, 29వతేదీల్లో కడపలో మన పెద్దపండుగ మహానాడు జరుగుతుందని, ఆ పండుగలో కార్యకర్తలంతా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

లోకేశ్ నిర్విరామ కృషితోనే ప్రాజెక్టు: కేశవ్



సోలార్ ప్రాజెక్టును జిల్లాకు తేవడానికి తమ నాయకుడు నారా లోకేశ్ నిర్విరామ కృషి చేశారని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. ఈ ప్రాజెక్టు వల్ల యువతకు ఉద్యోగావకాశాలు లభిస్తాయని అన్నారు. ప్రజా సమస్యలపై వచ్చే వినతులను పరిష్కరించేవరకూ లోకేశ్ ఫాలో అప్‌చేస్తూ ఉంటారని, ఎమ్మెల్యేలు, ఇతర మంత్రుల కంటే ఎంతో చురుగ్గా దూసుకెళ్తున్నారని అన్నారు. కేంద్రం, చంద్రబాబు అనే బ్రాండ్‌తో రాష్ట్రానికి ఎన్నో పరిశ్రమలు వస్తాయని అన్నారు. వైసీపీ హయాంలో ఉద్యోగుల జీతాలు కూడా ఇవ్వని స్థితిలో రాష్ట్రం ఉండేదని అన్నారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన వెంటనే సమర్థవంతమైన రాజకీయవేత్త అని నిరూపించుకుంటున్నారని అన్నారు. ఉద్యోగుల జీతాలను, పింఛన్లను సకాలంలో చెల్లిస్తున్నారని, శరవేగంగా అభివృద్ధి చేస్తున్నారని అన్నారు. రాష్ట్రానికి పరిశ్రమలను తెచ్చే పనిలో నిమగ్నమయ్యారన్నారు. ఎన్నడూ లేని విధంగా హంద్రీనీవా కాలువను రూ.3,800 కోట్లతో విస్తరిస్తున్నారని, అది రాయలసీమ అభివృద్ధి విషయంలో చంద్రబాబు నాయుడు చిత్తశుద్ధికి నిదర్శనమని అన్నారు. ఇప్పుడు రూ.22,000 కోట్లతో రెన్యూవబుల్ ఎనర్జీ ప్లాంట్‌ను తెస్తున్నారని అన్నారు. మంత్రి నారా లోకేశ్ విద్యాశాఖలో సంస్కరణలు తెస్తున్నారని, టైం మేనేజ్‌మెంట్‌లో చంద్రబాబు నాయుడుతో పోటీపడుతున్నారని అన్నారు. పార్టీ నాయకుల కంటే కార్యకర్తలకే లోకేశ్ ఎక్కువ సమయాన్ని కేటాయిస్తున్నారని, రానున్న 30 ఏళ్లపాటు బలమైన నాయకత్వాన్ని తయారుచేసే పనిలో ఉన్నారని కితాబిచ్చారు.

పది గంటలు పనిచేస్తా: ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం



సీఎం చంద్రబాబును ఆదర్శంగా తీసుకుని లోకేశ్ నిర్విరామంగా పనిచేస్తున్నారని, ఆయనతో పోటీ పడుతూ కనీసం రోజుకు పదిగంటలు పనిచేస్తానని గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం అన్నారు. కార్యకర్తలందరికీ ప్రాధాన్యమిస్తామని, సమష్ట కృషితో రానున్న ఎన్నికలన్నింటిలోనూ టీడీపీ జెండా రెపరెలాడేలా చేద్దామని అన్నారు.

గొప్పనేత లోకేశ్: వెంకటశివుడు యాదవ్



కార్యకర్తలకు నిత్యం అండగా నిలిచే గొప్ప నాయకుడు నారా లోకేశ్ అని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, లేబర్ బోర్డు చైర్మన్ వెంకట శివుడు యాదవ్ అన్నారు. కార్యకర్తలను మరచిపోకుండా వారితో సమావేశమై, సమస్యలను తెలుసుకుని అండగా ఉంటానని హామీ ఇస్తున్నారని అన్నారు. యువత భవితకు, రాష్ట్రాభివృద్ధికి, 20 లక్షల ఉద్యోగాలు కల్పించడానికి లోకేశ్ అహరహం శ్రమిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఏడీసీసీ బ్యాంకు చైర్మన్ కేశవరెడ్డి, ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు, టీడీపీ రాష్ట్ర మీడియా కో-ఆర్డినేటరు బీవీ వెంకటరాముడు, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు, రాష్ట్ర కార్యదర్శి తలారి ఆదినారాయణ, మాజీ ఎమ్మెల్యే జితేంద్ర గౌడు, నాయకులు కేసీ హరి, ఎద్దుల సుబ్రహ్మణ్యం, గాజుల ఆదెన్న, రామలింగారెడ్డి, గౌస్ మొద్దీన్, వెంకటప్ప, రాయల్ మురళి, గుమ్మనూరు నారాయణ స్వామి, సిమెంటు పోలన్న, బండారు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



సార్..! కనికరించండి

● ప్రమాదంతో మంచాన పడ్డ టీడీపీ కార్యకర్త ● వైకల్య ధ్రువీకరణ పత్రం కోసం బాధితుడి ఎదురు చూపు

శ్రీధర్ (ఫైల్)



అన్నం తినిపిస్తున్న తల్లి జయమ్మ



తొమ్మిదేళ్లుగా మంచానికే పరిమితమైన శ్రీధర్‌కు సపర్యలు చేస్తున్న అన్న

అగళి, మే 15(ఆంధ్రజ్యోతి): పేద కుటుంబంలో పుట్టినా ఎవరినీ ఏదీ ఆశించకుండా ఉన్నంతలో పని చేసుకుంటూ పొట్టపోసుకునే టీడీపీ కార్యకర్త ఆ యువకుడు. విధి వక్రీకరించడంతో మంచానపడి బతుకుభారంగా గడుపుతున్నాడు. వివరాలు ఇలా... అగళి మండలం ఆర్‌జిపల్లి గ్రామానికి చెందిన దేవరాజు, జయ మ్మ దంపతుల కుమారులు శశిధర్, శ్రీధర్. వీరు ఇద్ద రూ అవివాహితులే. వీరు తొలి నుంచి టీడీపీ కార్యకర్తలుగా పని చేస్తున్నారు. శ్రీధర్ డ్రైవర్‌గా పనిచేసేవాడు. 2017లో అగళి గ్రామ సమీపంలో సువర్ణముఖి ఆయకట్టు కాలువ దగ్గర శ్రీధర్ నడిపే ఆటో బోల్తా పడింది. దీంతో వెన్నెముక దెబ్బతిని పూర్తిస్థాయిలో దివ్యాంగుడయ్యాడు. నడవలేడు, మల, మూత్ర విసర్జనకు కూడా వెళ్లలేడు. కనీసం కూర్చోవడానికి కూడా వీలు కాని దుర్భర పరిస్థితిని గడుపుతున్నాడు. అతడికి అన్ని సపర్యలూ తల్లి జయమ్మ, అన్న శశిధరే చేస్తున్నారు. ఈ యువకుడికి దివ్యాంగత్వ సర్టిఫికెట్ కూడా లేదు. దీంతో ప్రభుత్వం ప్రతినెలా అందించే పింఛన్ సొమ్ము కూడా అందడం లేదు. ఈనేపథ్యంలో దివ్యాంగత్వ సర్టిఫికెట్ కోసం హిందూపురం సదరన్, మడకశిర సదరన్ క్యాంపులకు తీసుకెళ్లినా అక్కడి డాక్టర్లు కనికరించలేదని తల్లి, సోదరుడు పేర్కొన్నారు. ఎంతగా తమ గోడు విన్నవించినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తమ తమ్ముడు శ్రీధర్‌ను ఆదుకోవాలని సోదరుడు శశిధర్ కోరారు.

మళ్లీ మొదటికి..!



డ్వామాలో తెగని బదిలీల పంచాయితీ

పీడీ కార్యాలయంలోనే ఏడుగురు ఏపీఓలు

ఏడు మండలాల్లో ఇన్‌చార్జిలు

ఉపాధి పనులపై తీవ్ర ప్రభావం



డ్వామా కార్యాలయంలో ఖాళీగా ఉన్న ఏపీఓలు

అనంతపురం క్లాక్‌టవర్, మే 15(ఆంధ్రజ్యోతి): డ్వామాలో ఉద్యోగుల బదిలీల ప్రక్రియ మళ్లీ మొదటికి వచ్చింది. రాష్ట్ర గ్రామీణాభివృద్ధి కమిషనర్ (సీఆర్‌డీ) ఇచ్చిన ఆదేశాల మేరకు మార్చి 22వతేదీ నాటికి ఉపాధి ఉద్యోగుల బదిలీలు పూర్తి చేయాలి. డ్వామా పీడీ కార్యాలయంలో ఏడుగురు ఏపీఓలు ఉండగా.. వారిని కాదని ఆ ఏడు మండలాలకు టెక్నికల్ అసిస్టెంట్లను ఇన్‌చార్జి ఏపీఓలుగా నియమించారు. ఏపీఓలు ఉండగా ఇన్‌చార్జిలను నియమించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మరో వైపు గ్రామీణ ప్రాంతాల్లో కూలీలకు ఉపాధి పనులు కల్పించడంలో వెనుకబడిఉన్నారు. గతేడాది మే నెలలో సగటున 1.4 లక్షల మందికి ఉపాధి పనులు కల్పించేవారు. ఈసారి 97వేల మందికి మించి పనులు కల్పించలేకపోతున్నారు. 31 మండలాలకు గాను 17 మండలాల్లో సగటున రోజుకు మూడువేల పనిదినాలు దాటడం లేదంటే ఏ స్థాయిలో వెనుకబడిఉన్నారో అర్థమవుతుంది. కూడేరుకు బదిలీ చేసిన ఏపీఓ తులసీ ప్రసాద్, అన్నమయ్య జిల్లా నుంచి యల్లనూరుకు బదిలీ చేసిన రవి, రాయదుర్గం విజయభారతి, బుక్కరాయసముద్రం మల్లేశ్వరి, గుంతకల్లు విమల, ఆత్మకూరు నుంచి సుజాత, తాడిపత్రి నుంచి రాజేశ్వరి ఆయా ప్రాంతాల్లో విధుల్లోకి చేరలేదు. దీంతో నెల రోజుల నుంచి డ్వామా పీడీ కార్యాలయంలోనే ఉంటున్నారు. ఉదయం 10 గంటలకు కార్యాలయానికి వచ్చి...సాయంత్రం 5 గంటలకు వెళుతున్నారు. కుందుర్పి, ఆత్మకూరు, పుట్లూరు, బ్రహ్మసముద్రం, కంబదూరు, డి.హీరేహాళ్, పెద్దవడుగూరు మండలాలకు టెక్నికల్ అసిస్టెంట్లకు ఇన్‌చార్జి ఏపీఓలుగా నియమించారు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి పనుల కల్పనపై తీవ్ర ప్రభావం చూపుతోంది.

అన్నీ సర్దుబాటు చేస్తున్నాం



పరిపాలనా సౌలభ్యం కోసం ఏపీఓలు, టెక్నికల్ అసిస్టెంట్లను సర్దుబాటు చేస్తున్నాం. సీఆర్‌డీ ఇచ్చిన ఆదేశాల మేరకు ఉద్యోగుల బదిలీల ప్రక్రియ పూర్తి చేశాం. అక్కడక్కడ కొంత సమస్య ఉన్న మాట వాస్తవమే. స్థానిక పరిస్థితులు, ఉపాధి పనుల డిమాండ్ ఆధారంగా ఉద్యోగుల బదిలీల్లో కొంత చిక్కువచ్చింది. అన్నింటినీ పరిశీలించి సమస్యను కొలిక్కితీసువచ్చేందుకు కృషి చేస్తున్నాం. ఉపాధి పనులు కూలీలకు సగటున 1.5 లక్షల మందికి కల్పించాలని లక్ష్యాన్ని నిర్దేశించాం. క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యను పరిష్కరిస్తున్నాం.

\- సలీంబాషా, పీడీ, డ్వామా

శిశుగృహ సంరక్షణలో ఖ్యాతిశ్రీ



అనంతపురం విద్య, మే 15(ఆంధ్రజ్యోతి): నగరంలోని విజయనగర్ కాలనీలో ఇటీవల వదిలేసిన 22 రోజుల శిశువు ఖ్యాతిశ్రీ శిశుగృహ సంరక్షణలో ఉందని ఐసీడీఎస్ పీడీ నాగమణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శిశువు తల్లిదండ్రులు, బంధువులు తగిన ఆధారాలతో 30 రోజులలో తమను సంప్రదించాలన్నారు. లేకుంటే బాలల సంక్షేమ సమితి ద్వారా శిశువును అనాథగా ప్రకటిస్తామన్నారు. దత్తత నియమ నిబంధనలు -2022 మేరకు, బాలల న్యాయ చట్టం 2015 మేరకు దత్తత కావాలనుకునే తల్లిదండ్రులకు చట్టబద్ధంగా దత్తత ఇస్తామని తెలిపారు.

ప్రైమరీ స్కూళ్లను కాపాడండి: ఆప్టా

అనంతపురం విద్య, మే 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రైమరీ స్కూళ్లను కాపాడాలని ఏపీ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (ఆప్టా) జిల్లా అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి వెంకటరత్నం గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 117 జీవోకు ప్రత్యామ్నాయంగా ఇటీవల విడుదల చేసిన జీవోల వల్ల జిల్లాలో 500 పైగా ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మిగిలే అవకాశం ఉందన్నారు. రాబోయే రోజుల్లో అవి జీరో ఎన్‌రోల్‌మెంట్‌గా మారి, శాశ్వతంగా మూతపడే ప్రమాదం ఉందన్నారు. యూపీ స్కూళ్లలోని స్కూల్ అసిస్టెంట్లను తొలగించి అక్కడున్న 6,7,8 క్లాసుల విద్యార్థులకు సబ్జెక్టు టీచర్ల సేవలు దూరం చేశారన్నారు. హైస్కూళ్లలో టీచర్, స్టూడెంట్ నిష్పత్తి 1:54గా చూపడం వల్ల చాలా మంది స్కూల్ అసిస్టెంట్లు మిగులుగా మారిపోయారన్నారు. ఇలా అనేక అశాస్త్రీయ నిర్ణయాలతో విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేసే చర్యలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సమస్యలపై మానవ వనరుల శాఖా మంత్రి నారా లోకేశ్ దృష్టి సారించి, పరిష్కరించాలని కోరారు.

అవార్డుల కోసం దరఖాస్తుల ఆహ్వానం

యాదవ ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షుడు నాగభూషణం



విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న నాగభూషణం

అనంతపురం కల్చరల్, మే 15 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివిన పదోతరగతి, ఇంటర్మీడియట్ యాదవ విద్యార్థుల నుంచి ప్రతిభా అవార్డుల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు నక్కా రామారావు ఎడ్యుకేషనల్, కల్చరల్ ట్రస్టు బోర్డు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగభూషణం పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని రుద్రంపేట నక్కా రామారావు యాదవ భవన్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 10వ తరగతిలో 400 మార్కులకు పైగా, ఇంటర్మీడియట్‌లో 700లకు పైగా మార్కులు సాధించిన విద్యార్థులు ఈ అవార్డులకు అర్హులన్నారు. ట్రస్టు ఆధ్వర్యంలో గత రెండు దశాబ్దాలుగా ప్రతిఏటా ప్రతిభా అవార్డులను అందజేస్తూ వస్తున్నట్లు తెలిపారు. జూన్ 1న నిర్వహించే అవార్డుల ప్రదానోత్సవ సభకు యాదవ ప్రముఖ్యులు, ప్రజాప్రతినిధులు ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు. విద్యార్థులు 83094 75846, 94922 87710 నెంబర్లకు వాట్సాప్‌లో దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో ట్రస్టు జిల్లా కోశాధికారి శ్రీనివాసులు, యాదవ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రామకృష్ణ, ట్రస్టు సభ్యులు శ్రీరాములు, లక్ష్మీనారాయణ,ఉమాశంకర్, హేమంత్ పాల్గొన్నారు.

గవర్నర్ పర్యటన ఏర్పాట్లపై ఆరా

ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌ను పరిశీలించిన కలెక్టర్

అనంతపురం టౌన్, మే 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గవర్నర్ జిల్లా పర్యటనలో భాగంగా విశ్రాంతి తీసుకునే ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో ఏర్పాట్లపై కలెక్టర్ వినోద్‌కుమార్ గురువారం ఆరా తీశారు. జేఎన్‌టీయూ స్నాతకోత్సవంలో పాల్గొనడానికి రాష్ట్ర గవర్నర్ ఈనెల17న అనంతపురం వస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కలెక్టరు వినోద్‌కుమార్ గురువారం ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో ఏర్పాట్లను పరిశీలించారు. అందులోని సోఫాలు, ఫర్నిచర్, ఏసీల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆప్రాంతంలో భద్రత చర్యల గురించి పోలీస్‌శాఖ వారిని అడిగి తెలుసుకున్నారు. గవర్నరు పర్యటనలో ఎక్కడా ఎలాంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని అధికారులకు కలెక్టరు ఆదేశించారు. కార్యక్రమంలో జేసీ శివనారాయణశర్మ, ఆర్డీఓ కేశవనాయుడు, డిప్యూటీ కలెక్టరు రామ్మోహన్, ఆర్‌అండ్‌బీ డీఈ కాటమయ్య, సివిల్‌సప్లై డీఎం రమేష్‌రెడ్డి, డీఎస్‌ఓ జగన్నాథ్‌రావు పలువురు తహసీల్దార్లు పాల్గొన్నారు.



ఆర్‌అండ్‌బీలో గెస్ట్‌హౌస్‌లో అధికారులకు కలెక్టరు ఆదేశాలు

వర్ష బీభత్సం..!

అనంతపురం, రాప్తాడు, కనగానపల్లి మండలాల్లో దంచికొట్టిన వాన



- నీట మునిగిన పలు కాలనీలు
- ఇళ్లలోకి చేరిన వర్షపునీరు
- నానా అవస్థలు పడ్డ జనం
- తడిసిపోయిన తిండి గింజలు
- కొట్టుకుపోయిన ఇళ్లలోని సామగ్రి

అనంతపురంరూరల్/రాప్తాడు/కనగానపల్లి, మే15(ఆంధ్రజ్యోతి): వర్షం బీభత్సం సృష్టించింది. బుధవారం అర్ధరాత్రి తర్వాత ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. దీంతో వాగులు, వంకలు ఉప్పొంగాయి. అనంతపురం రూరల్, రాప్తాడు మండలాల్లోని పలు కాలనీలు నీటమునిగాయి. ఇళ్లలోకి వర్షపు నీరు చేరింది. దీంతో బియ్యం బస్తాలు తదితర తిండిగింజలు తడిసిపోయాయి. కొంత సామగ్రి వర్షపు నీటిలో కొట్టుకుపోయింది. దీంతో ఆయాప్రాంతాల ప్రజల అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. అనంతపురం రూరల్ మండలంలోని ఆకుతోటపల్లి సమీపాన గల శిల్పాలేపాక్షి నగర్‌లోకి పెద్దఎత్తున నీరు చేరింది. క్రిష్ణంరెడ్డిపల్లి క్రాస్‌లోని సీపీఐ కాలనీలో సైతం ఇదే పరిస్థితి కినిపించింది. కక్కలపల్లి పంచాయతీ పరిధిలోని బీజేపీ కొట్టాలలో పరిస్థితి మరింత దయనీయంగా కనిపించింది.

పోటెత్తిన వంకలు

బుధవారం అర్ధరాత్రి నుంచి తెల్లవారుజామున ఐదు గంటల వరకు ఓ మోస్తరు వర్షం కురిసింది. వంకలు పరవళ్లు తొక్కాయి. కందుకూరు గ్రామ సమీపంలో కోతుల వంక, ఉప్పరపల్లిలోని చప్పిడి వంక, పండమేరు వంక ఉధృతంగా ప్రవహించాయి. సాయంత్రంమైనా నీటి ప్రవాహం తగ్గలేదు. ఉప్పరపల్లి ప్రాంతవాసులు పూలకుంట, ఇటుకలపల్లి మీదుగా నగరానికి రావాల్సి వచ్చింది. రాప్తాడు పరిధిలో వర్షం మరింత ఎక్కువగా నమోదు కావడంతో కింది భాగంలో ఉన్న ఈ ప్రాంతాల్లోని వంకలు పొంగిపొర్లాయి. రైల్వే లోకో పైలెట్ విధుల నిమిత్తం ఆకుతోటపల్లి నుంచి కందుకూరు మీదుగా ధర్మవరానికి కారులో వెళ్తూ కోతుల వంకలో చిక్కుకున్నాడు. నీటి ప్రవాహం ఎక్కువ అవుతుండటంతో ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులకు లోకేషన్ షేర్ చేశాడు. కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకున్నారు. కందుకూరు గ్రామం నుంచి కూరగాయల మార్కెట్‌కు నగరానికి వెళ్తున్న వారికి విషయం చెప్పడంతో గ్రామం నుంచి సదరు ఆటో డ్రైవర్ మరి కొంతమందిని అక్కడికి తీసుకొచ్చి, లోకో పైలెట్‌ను బయటకు తీసుకొచ్చారు.

శిల్పాలేపాక్షి నగర్‌లోకి వరద నీరు..

జంగాలపల్లి, కందుకూరు, ఆకుతోటపల్లి తదితర ప్రాంతాల్లో కురిసిన వర్షానికి ఆకుతోటపల్లి సమీపంలోని వంక ఉధృతంగా ప్రవహించింది. ఎగువ ప్రాంతాల్లోని వర్షపు నీరంతా ఆ వంకలోకి చేరడంతో దిగువన ఉన్న శిల్పాలేపాక్షినగర్ లోకి వరద నీరు పెద్దఎత్తున చేరింది. దీంతో కాలనీ జలమయమైంది. ఇళ్ల నుంచి బయటకు రాలేని పరిస్థితి కనిపించింది. రెవెన్యూ అధికారులు అక్కడికి చేరుకుని, పరిశీలించారు. స్థానికంగా నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న ప్రహరీని కూల్చివేయించారు. దీంతో సమస్య కొంత తగ్గింది. ఈక్రమంలోనే స్థానికులు.. ఆర్డీఓ కేశవనాయుడు, తహసీల్దార్ మోహన్‌కుమార్, ఎంపీడీఓ దివాకర్, పంచాయతీ కార్యదర్శి అశోక్‌బాబుకు సమస్యను వివరించారు. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. ఆకుతోటపల్లిలోని సెంట్రల్ స్కూల్ ప్రహరీ వర్షానికి కూలిపోయింది.

సీపీఐ కాలనీ జలమయం

క్రిష్ణంరెడ్డిపల్లి క్రాస్‌లో ఉన్న సీపీఐ కాలనీలోకి వర్షపునీరు పెద్దఎత్తున చేరింది. మోకాలి ఎత్తున నీరు ప్రవహించింది. ఇళ్లలోకి వర్షపు నీరు చేరింది. దీంతో స్థానికులు నానా అవస్థలు పడ్డారు. ధాన్యపు గింజలు, ఇళ్లలోని ఇతరత్రా సామగ్రి వర్షపు నీటిలో తడిసిపోయాయి. ఇళ్లలోని నీటిని బయటకు పంపేందుకు స్థానికులు అవస్థలు పడ్డారు. దాదాపు 30 ఇళ్లలోకి వర్షపు నీరు చేరినట్లు తెలుస్తోంది.

బీజేపీ కొట్టాలలో మరీ దారుణం

వర్షానికి మండలంలోని కక్కలపల్లి పంచాయతీ పరిధి బీజేపీ కొట్టాల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. స్థానికంగా ఉన్న కాలువ వర్షపునీటితో పెద్దఎత్తున ప్రవహించింది. ఇళ్లలోకి వర్షపు నీరు చేరడంతో స్థానికులు కంటిమీద కునుకు లేకుండా గడిపారు. ఇళ్లలోని సామగ్రి తడిసిపోయింది. కాలువలో పూడిక పేరుకుపోవడం, రక్షణగోడ, కల్వర్టులు సరిగా లేకపోవడంతో ఇళ్లలోకి నీరు చేరింది. కాలువపై అక్రమ నిర్మాణాలు మరో కారణంగా స్థానికులు చెబుతున్నారు. నీటి ప్రవాహం ఎక్కువవడంతో కొట్టాల సమీపంలోని ఓ వెంచర్ వర్షపు నీటితో నిండిపోయింది. స్థానికులు బయటకు వచ్చేందుకు ఇబ్బందులు పడ్డారు. నీటి ప్రవాహానికి అడ్డుగా మరో వెంచర్ వ్యక్తి షెడ్డు కట్టడంతో ఈ దుస్థితి దాపురించింది. రెవెన్యూ అధికారులు ఆ షెడ్డును తొలగించడంతో కొంత సమస్య తీరినట్లయింది.

రాప్తాడులో..

మండలవ్యాప్తంగా కుండపోత వర్షం కురిసింది. తెల్లవారుజామున 2 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకూ ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురవడంతో వంకలు, చెక్‌డ్యాంలు నిండాయి. రాప్తాడు పంచాయతీ పరిధిలోని సీపీఐ కాలనీ నీట మునిగింది. వర్షపునీరు ఎగువ ప్రాంతం నుంచి ఎక్కువగా రావడంతో సీపీఐ కాలనీ జలమయమైంది. ఇళ్లలోకి వర్షపు నీరు చేరింది. కాలనీలో 250 ఇళ్లు ఉండగా.. ప్రస్తుతం 150కిపైగా కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. వర్షపునీరు కాలనీలోని ఇళ్లలోకి పెద్దఎత్తున చేరింది. ఇళ్లలోని నిత్యావసర సరుకులు తడిసి ముద్దయ్యాయి. కాలనీ ప్రజలు వర్షపు నీటిలో చిక్కుకుపోయారు. గురువారం ఉదయం అగ్నిమాపక సిబ్బంది వచ్చి ఇళ్లలోని ప్రజలు, వృద్ధులు, చిన్నపిల్లలు, మహిళలను సురక్షితంగా బయటకు చేర్చారు. వర్షపునీరు సీపీఐ కాలనీలో నిల్వ ఉండకుండా బయటకు పంపే చర్యలు చేపట్టారు. ఎక్స్‌కవేటర్ సాయంతో నీరు వేగంగా దిగువ ప్రాంతానికి వెళ్లేలా చేశారు. కాలనీ వాసులందరూ సురక్షితంగా ఉండేలా సహాయక చర్యలు చేపట్టారు. రాప్తాడు సర్పంచ్ సాకే తిరుపాల్ ఉదయం సీపీఐ కాలనీ వాసులకు టిఫిన్ సౌకర్యం కల్పించారు. మధ్యాహ్నం జేసీ శివనారాయణశర్మ, అనంతపురం ఆర్డీఓ కేశవనాయుడు, రూరల్ డీఎస్పీ వెంకటేశులు, తహసీల్దార్ విజయకుమారి, ఎంపీడీఓ విజయలక్ష్మి, సీపీఐ నాయకులు మల్లికార్జున, రామకృష్ణ.. కాలనీని పరిశీలించారు. వర్షపు నీరు నిల్వ ఉండకుండా సహాయక చర్యలు చపట్టాలని అధికారులను జేసీ ఆదేశించారు.

రామినేపల్లిలో..

రాప్తాడు మండలంలోని రామినేపల్లిలో దాదాపు 20 ఇళ్లలోకి వర్షపు నీరు చేరింది. ద్విచక్రవాహనాలు నీటిలో మునిగిపోయాయి. తెల్లవారేవరకూ ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడిపారు. ఇళ్లలోని నిత్యావరస సరుకులు నీట మునిగాయి. భారీ వర్షానికి రామలింగప్ప, వెంకట్రాముడుకు చెందిన ఇంటి గోడలు కూలాయి. ఇంట్లో ఉన్నవారు ప్రమాదం నుంచి క్షేమంగా బయటపడ్డారు. రాప్తాడు పంచాయతీ పరిధిలోని మైనార్టీ కాలనీలో కూడా కొన్ని ఇళ్లలోకి వర్షపు నీరు చేరింది. దారులన్నీ జలమయమయ్యాయి. రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

పండమేరు పరవళ్లు

భారీ వర్షానికి పండమేరు వంక పరవళ్లు తొక్కింది. మండలవ్యాప్తంగా కుండపోత వర్షం కురవడంతో పండమేరు వంక ఉధృతంగా ప్రవహించింది. వంక ప్రాంతంలోని చెక్‌డ్యాంలు, నీటి కుంటలు జలకళ సంతరించుకున్నాయి. ఖరీఫ్ ప్రారంభంలోనే మండల వ్యాప్తంగా భారీ వర్షం కురవడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పలుచోట్ల పిడుగులు

భారీ వర్షానికి రాప్తాడు గ్రామంలోని అద్ర ఎర్రగుంటప్ప, రామలింగయ్య ఇంటిపై పిడుగులు పడ్డాయి. ఎర్రగుంటప్ప ఇంటి మీద ఉన్న డిష్ గంప మీద పిడుగు పడటంతో గోడకు రంధ్రం ఏర్పడింది. రామలింగయ్య ఇంటిపై పిడుగు పడటంలో గోడ నెర్రెలు చీలింది. ఇంటిలోని వైరింగ్ మొత్తం కాలిపోయింది. ఆ ఇళ్లలో ఉన్న వారికి ఎటువంటి ప్రమాదం లేదు.

నిండిన నీటికుంటలు

భారీ వర్షానికి కనగానపల్లి మండలంలో నీటికుంటలు నిండిపోయాయి. చెక్‌డ్యాంలలోకి నీరు చేరింది. ఖరీఫ్ ప్రారంభంలో ముందస్తుగా వర్షాలు కురవడంపై రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ముక్తాపురం గ్రామ వీధుల్లో వర్షపు నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. అనంతపురంరూరల్ మండలంలోని పలు నీటి కుంటలు జలకళ సంతరించుకున్నాయి. ఆకుతోటపల్లి, కక్కలపల్లి ప్రాంతాల్లోని నీటికుంటలు నిండి, పొంగిపొర్లాయి.



ప్రజాశక్తి నగర్‌లో రోడ్డుపై నిల్వ ఉన్న వర్షపు నీరు



కందుకూరు సమీపంలోని కోతుల వంకలో కొట్టుకొచ్చిన కారు



ప్రజాశక్తి కాలనీలో ఇంట్లోకి నీరు చేరడంతో నానిన వస్తువులను బయట ఆరబెడుతున్న దృశ్యం



ప్రజాశక్తి కాలనీలోని ఓ ఇంట్లోకి చేరిన వర్షపు నీరు



ఇంట్లోకి చేరిన వర్షపు నీటిని బయటకు తోడిపోస్తున్న మహిళ



శిల్పా లేపాక్షి నగర్‌లో ఇళ్ల మధ్యలో నిలిచిన వరద నీరు



క్రిష్ణంరెడ్డిపల్లిలో ఇంటి చుట్టు చేరిన నీరు



ఆకుతోటపల్లిలో పడిపోయిన సెంట్రల్ స్కూల్ గోడ



ఉప్పరపల్లి సమీపంలో ఉధృతంగా ప్రవహిస్తున్న చప్పిడి వంక

ఎక్కడెక్కడ.. ఎంతెంత వానంటే..

అనంతపురం అర్బన్/పుట్టపర్తిరూరల్: ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో బుధవారం రాత్రి భారీ వర్షం పడింది. అత్యధికంగా రాప్తాడులో 141.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. కనగానపల్లి 75.2, ధర్మవరం 71.6, కళ్యాణదుర్గం 53.2, బుక్కపట్నం 46.0, తాడిమర్రి 41.2, ఆత్మకూరు 38.0, బత్తలపల్లి 36.2, బ్రహ్మసముద్రం 35.0, బుక్కరాయసముద్రం 34.2, పుట్టపర్తి 33.2, చిలమత్తూరు 33.2 మిమీ, కొత్తచెరువు, శెట్టూరు 27.6, పామిడి 26.4, నార్పల 25.6, అనంతపురం 24.6, గాండ్లపెంట 24.4, కదిరి 21.2, అమడగూరు 20.8, ఓబుళదేవరచెరువు 16.4, చెన్నేకొత్తపల్లి 16.2, ముదిగుబ్బ 12.6, రాయదుర్గం 12.4, కంబదూరు 12.2, రామగిరి 11.8, గుమ్మఘట్ట 10.2, యాడికి 10.0, పెద్దవడుగూరు 9.6, తలుపుల 9.4, డి.హిరేహాళ్ 8.6, కూడేరు 8.0, నల్లచెరువు 7.2, శింగనమల 5.8, తాడిపత్రి, గోరంట్ల 5.4, తనకల్లు, గార్లదిన్నె 4.8, బెలుగుప్ప, యల్లనూరు 4.6, నల్లమాడ 4.2, సోమందేపల్లి 3.8, పెద్దపప్పూరు 3.6, గుంతకల్లు 3.4, పెనుకొండ 2.8, గుత్తి, కుందుర్పి 2.6, నంబులపూలకుంట 2.4, రొద్దం 2.0, వజ్రకరూరులో 1.2 మి.మీ. వర్షం కురిసిందని వాతావరణ శాఖాధికారులు తెలిపారు.

పోయిన డబ్బుకు బ్యాంకుదే బాధ్యత

వినియోగదారుల కమిషన్ తీర్పు

అనంతపురం క్రైం, మే 15(ఆంధ్రజ్యోతి): తన ప్రమేయం లేకుండానే ఖాతాదారుడు నష్టపోతే ఆ మొత్తాన్ని బ్యాంకే చెల్లించాలని జిల్లా వినియోగదారుల కమిషన్ అధ్యక్షురాలు ఎం.శ్రీలత తీర్పు ఇచ్చారు. అనంతపురానికి చెందిన అంబేడ్కర్ గురుకుల కళాశాల టీచర్ సునీతకు స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) అనంతపురంలో ఖాతా ఉంది. ఈ ఖాతా నుంచి 2023 మే నెలలో ఆధార్ గుర్తింపు ఆధారిత పేమెంట్ వ్యవస్థ(ఏడీపీఎస్) ద్వారా గుర్తు తెలియని వ్యక్తులు ఐదు విడతలుగా రూ.40,200లు డ్రా చేశారు. ఈ విషయంపై ఆమె అదే ఏడాది మే 24న బ్యాంకు మేనేజర్‌కు ఫిర్యాదు చేశారు. 15రోజుల్లో బ్యాంకు వారు డబ్బు తిరిగి జమ చేస్తామని చెప్పి స్పందించలేదు. దీంతో ఆమె వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు. నోటీస్ అందుకున్న బ్యాంకు అధికారులు ఏడీపీఎస్ లావాదేవీలు ఖాతాదారుల ఆధార్ ఆధారంగా వేలిముద్ర గుర్తింపు ఉపయోగించి జరిగిన వాటికి బ్యాంకు బాధ్యత వహించదని తెలిపారు. ప్రతి లావాదేవీకి మొబైల్‌కు మెసేజ్ కూడా పంపబడిందన్నారు. అయితే కమిషన్ పరిశీలనలో ఈ అంశం నిరూపణ కాలేదు. జిల్లా వినియోగదారుల కమిషన్ అధ్యక్షురాలు శ్రీలత, సభ్యుడు గోపీనాథ్‌లతో కూడిన ధర్మాసనం ఆర్‌బీఐ 06.07.2017సర్క్యులర్ ప్రకారం ఖాతాదారులకు సమాచారం ఇవ్వకుండా జరిగిన లావాదేవీలకు బ్యాంక్ బాధ్యత వహించాల్సిఉంటుందని తీర్పు వెలువరించారు. బ్యాంకు రూ.40,200లను ఆరు శాతం వడ్డీతో 2023 మే 23 నుంచి చెల్లించాలని, మానసిక ఒత్తిడి, సేవల లోపానికి రూ.10వేలు నష్టపరిహారం చెల్లించాలని, కరెస్పాండెన్స్, ప్రయాణ ఖర్చులకు రూ.5వేలు చెల్లించాలని ఆదేశించారు. ఈ మొత్తాన్ని 45 రోజుల్లో ఫిర్యాదుదారురాలికి చెల్లించాల్సిందిగా కమిషన్ ఆదేశించింది.

బోరుగడ్డ అనిల్‌కు బెయిల్

అనంతపురం క్రైం, మే15(ఆంధ్రజ్యోతి): తాను ఐఏఎస్ అధికారినని చెప్పి సీఐ మురళీకృష్ణను బెదిరించిన కేసులో బోరుగడ్డ అనిల్‌కు బెయిల్ మంజూరైంది. 2018లో అనంతపురం త్రీటౌన్ సీఐ మురళీకృష్ణను బెదిరించిన కేసు విచారణ నిమిత్తం గురువారం జిల్లా జైలు నుంచి బోరుగడ్డ అనిల్‌ను కోర్టులో హాజరుపరిచారు. స్పెషల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ (మొబైల్ కోర్టు) ఇన్‌చార్జి న్యాయాధికారి హారిక రావూరి బెయిల్ మంజూరు చేశారు. ఈ కేసులో పోలీసులు సరైన సాక్ష్యాధారాలు చార్జ్‌షీట్‌లో పొందుపరచలేకపోయారనీ, కేసు కొట్టివేయాలని అనిల్ తరపు న్యాయవాది నారాయణరెడ్డి డిశ్చార్జి పిటీషన్ దాఖలు చేశారు. కేసు విచారణను ఈనెల 28వ తేదీకి వాయిదా వేశారు. ఇదివరకే ఫోర్త్‌టౌన్ కేసులోనూ బెయిల్ రావడంతో అనంతపురంలో నమోదైన రెండు కేసుల్లోనూ బోరుగడ్డకు బెయిల్ లభించినట్లయింది.

వీరజవాన్ తల్లికి పాదాభివందనం

- పరామర్శించిన సినీనటుడు శివారెడ్డి



మురళీనాయక్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న శివారెడ్డి

గోరంట్ల, మే15 (ఆంధ్రజ్యోతి): వీరమరణం పొందిన వీర జవాన్ మురళీనాయక్ తల్లి జ్యోతిబాయికి సినీ నటుడు, మిమిక్రీ కళాకారుడు శివారెడ్డి గురువారం పాదాభివందనం చేశారు. మండలంలోని కళ్లితండాలో ఉన్న వీర జవాన్ తల్లిదండ్రులను శివారెడ్డి గురువారం పరామర్శించారు. మురళీనాయక్ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆర్టిస్టు వాసు గీసిన మురళీనాయక్ చిత్రపటాన్ని ఆయన తల్లికి బహూకరించారు. ఆయన మాట్లాడుతూ మురళీనాయక్ దేశభక్తితోపాటు క్రీడలు, కళ, తదితర రంగాల్లో నిష్ణాతుడని తెలిసి వారి కుటుంబాన్ని పరామర్శించడానికి తాను ఇక్కడికి వచ్చినట్లు చెప్పారు. పాకిస్థాన్ ముష్కర్లకు గుణపాఠం చెబుతున్న తరుణం మురళీనాయక్ మృతి చెందడం బాధాకరమన్నారు. ఒక్కగానొక్క కొడుకును దేశ రక్షణకు పంపి వీరమాతైనావు అంటూ జ్యోతీబాయిని కొనియాడారు. నేను కూడా నీ బిడ్డలాంటి వాడినే అంటూ ఆమెకు ధైర్యం చెబుతూ, పాదాలకు నమస్కరించాడు. కార్యక్రమంలో ఆర్టిస్టు వాసు, సర్పంచ్ వాసునాయక్ తదితరులు పాల్గొన్నారు.

చీనీ టన్ను రూ.32 వేలు

అనంతపురం రూరల్, మే 15(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లోని చీనీ ధర మరింత పెరిగింది. గురువారం టన్ను గరిష్ఠంగా రూ. 32వేలు పలికింది. కనిష్ఠంగా రూ. 4,250, సరాసరి రూ. 20వేలతో అమ్ముడు పోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 681 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

ఏపీఈసెట్‌లో 91 శాతం ఉత్తీర్ణత

ఫలితాలను విడుదల చేసిన జేఎన్‌టీయూ వీసీ సుదర్శనరావు

అనంతపురం సెంట్రల్, మే 15(ఆంధ్రజ్యోతి): బీటెక్, బీఫార్మసీ కోర్సుల్లో ద్వితీయ సంవత్సరం ప్రవేశాలు కల్పించేందుకు నిర్వహించిన ఏపీఈసెట్-2025 పరీక్షా ఫలితాల్లో ఉమ్మడి జిల్లాలో 91.85 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఏపీ, తెలంగాణలో ఏపీఈసెట్-2025ను జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో నిర్వహించారు. కమిటీ చైర్మన్‌గా వీసీ ప్రొఫెసర్ సుదర్శన రావు, కన్వీనర్‌గా ప్రొఫెసర్ దుర్గాప్రసాద్ వ్యవహరించారు. ఉమ్మడి జిల్లాలో 2,650 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా.. 2,434 మంది ఉత్తీర్ణత సాధించారు. ఉత్తీర్ణత శాతం 91.85గా నమోదైంది. 14 బ్రాంచ్ (కోర్సు)లకు పరీక్షలు నిర్వహించి ఫలితాలు విడుదల చేశారు. తొలిసారిగా వాట్సాప్ ద్వారా విద్యార్థులకు ఫలితాలు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు వీసీ తెలిపారు. 9552300009 నంబర్‌కు హాయ్ అని మేసేజ్ పెట్టి విద్యార్థులు ఫలితాలనుపొందవచ్చన్నారు.https://cets.apsche.ap.gov.in/ECET/ECET/ECET వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ క్రిష్ణయ్య, కన్వీనర్ ప్రొఫెసర్ దుర్గాప్రసాద్, డైరెక్టర్లు సత్యనారాయణ, భానుమూర్తి పాల్గొన్నారు.

ర్యాంకులు రాలే..

ఈసెట్ ఫలితాల్లో ఉమ్మడి జిల్లాకు రాష్ట్రస్థాయి ర్యాంకులు దక్కలేదు. మైనింగ్ ఇంజనీరింగ్ బ్రాంచ్ విద్యార్థి పఠాన్ రఖీబ్ ఖాన్ ఒక్కడే ఆ బ్రాంచ్‌లో రాష్ట్రస్థాయి తృతీయ ర్యాంకు సాధించాడు. మిగిలిన 13 బ్రాంచ్‌ల్లో టాప్ పది ర్యాంకుల్లో జిల్లాకు చోటు దక్కలేదు. 91.85శాతం మంది ఉత్తీర్ణత సాధించినా మెరుగైన ర్యాంకులు సాధించకపోవడం గమనార్హం.

రాయలచెరువు విద్యార్థి ప్రతిభ



రఖీబ్‌ఖాన్

యాడికి: మండలంలోని రాయలచెరువు గ్రామానికి చెందిన టోఫీఖాన్, షఫియాబేగం దంపతుల కుమారుడు రఖీబ్‌ఖాన్ మైనింగ్ ఇంజనీరింగ్‌లో రాష్ట్రస్థాయిలో మూడో ర్యాంకు తో సత్తాచాటాడు. పులివెందులలోని లయోలా పాలిటెక్నిక్ కళాశాలలో మైనింగ్ ఇంజనీరింగ్‌లో డిప్లొమో చేశాడు. ఇంజనీరింగ్ ప్రవేశం కోసం నిర్వహించిన ఏపీ ఈ-సెట్‌లో రఖీబ్‌ఖాన్ ప్రతిభ కనబరిచాడు. 96 మార్కులతో రాష్ట్రస్థాయి ర్యాంకు కైవసం చేసుకున్నాడు.

నాటిన ప్రతిమొక్కను రక్షించాలి

- సీఎఫ్, డీఎఫ్ఓ

అనంతపురం న్యూటౌన్ మే 15 (ఆంధ్రజ్యోతి) జిల్లాలో రిజర్వ్ ఫారెస్ట్‌లో నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని సీఎఫ్ యశోదాబాయి, డీఎఫ్ఓ విఘ్నేష్ తమ సిబ్బందిని ఆదేశించారు. శెట్టూరు మండలంలో రైతు ఎల్‌కే నాయుడు పెంచుకొన్న ఎర్రచందనం చెట్ల కోతకు అనుమతి కోరుతూ అర్జీ పెట్టుకున్నాడు. ఈ నేపథ్యంలో గురువారం సీఎఫ్, డీఎఫ్ఓ క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టారు. అనంతరం శెట్టూరు మండలంలో 84 హెక్టార్ల రిజర్వ్ ఫారెస్ట్‌లో పెంచుతున్న చెట్లను పరిశీలించారు. వాటి సంరక్షణకు స్థానిక సిబ్బందికి సూచనలు చేశారు. మరో ప్రాంతంలో 20 హెక్టార్ల రిజర్వ్ ఫారెస్ట్‌లో ఉన్న చెట్లను పరిశీలించారు. అనంతరం గుండ్లపల్లిలో నర్సరీని తనిఖీ చేశారు. అలాగే కళ్యాణదుర్గంలో రూపుదిద్దుకుంటున్న నగరవనాన్ని పరిశీలించారు. అభివృద్ధి పనులు చివరి దశకు చేరుకోవడంతో ప్రారంభానికి తగిన విధంగా చర్యలు చేపట్టేలా చూడాలని అటవీక్షేత్రాధికారి మధుబాబును ఆదేశించారు.

డెంగీపై అవగాహన కల్పిద్దాం: డీఎంహెచ్ఓ

అనంతపురం టౌన్, మే15(ఆంధ్రజ్యోతి): వర్షాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో డెంగీపై ప్రజలకు అవగాహన కల్పిద్దామని వైద్యులు, సిబ్బందికి జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఈబీ దేవి సూచించారు. స్థానిక జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో గురువారం జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా అవగాహన పోస్టర్లను ఆవిష్కరించారు. జిల్లా వైద్యాధికారి మాట్లాడుతూ.. దోమల నుంచే డెంగీ సోకుతుందన్నారు. దోమలు వృద్ధి చెందకుండా, వాటి కాటు బారిన పడకుండా తీసుకోవాల్సిన చర్యలు, డెంగీ బారిన పడితే చికిత్సలు, జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఆ మేరకు గ్రామాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి, ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి (డీఎంఓ) డాక్టర్ ఓబులు, డీఐఓ డాక్టర్ యుగంధర్, డాక్టర్లు పాల్గొన్నారు.

వైద్యసిబ్బంది ప్రొవిజనల్ మెరిట్ జాబితా విడుదల

అనంతపురం టౌన్, మే15(ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్యఆరోగ్య శాఖలో ఎన్‌హెచ్ఎం కింద చేపడుతున్న వైద్యసిబ్బంది నియామకాలకు సంబంధించి అభ్యర్థుల ప్రొవిజనల్ మెరిట్ జాబితా విడుదల చేసినట్లు జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఈబీ దేవి గురువారం ప్రకటనలో తెలిపారు. సైకాలజిస్టు, ఆడియాలజిస్ట్, ఆప్తమాలజిస్ట్, ఫార్మసిస్ట్, డేటాఎంట్రీ ఆపరేటర్, క్లాస్-4 సర్వీస్ పోస్టు మొత్తం ఆరింటికి ప్రొవిజనల్ జాబితాను ప్రకటించామన్నారు. వైద్యశాఖ వెబ్‌సైట్‌లో ఉంచామన్నారు. జాబితాపై అభ్యంతరాలుంటే ఈనెల 19వతేదీ సాయంత్రం 5 గంటలలోపు ఆధారాలతో తెలియజేయాలని జిల్లా వైద్యాధికారి కోరారు.



కూల్చివేయగా మిగిలిన వాసవీమాత ఆలయం



రోడ్డు పక్కన ఉన్న శిథిల భవనాలు

పరిహారమేదీ..?

- రోడ్డు విస్తరణ పేరుతో అనుమతి లేకున్నా 85 ఇళ్ల కూల్చివేత
- కోర్టు నోటీసులున్నా ధిక్కరణ
- వైసీపీ హయాంలో అధికారుల దుశ్చర్య
- 20 నెలలవుతున్నా అందని పరిహారం
- ఆదుకుంటామని ఎన్నికల వేళ హామీ
- నిరీక్షిస్తున్న బాధితులు

తాడిమర్రి, మే 15(ఆంధ్రజ్యోతి): రోడ్డు విస్తరణకు అనుమతి లేదు... రోడ్డు వెడల్పు చేయరాదని కోర్టు నుంచి నోటీసులు ఉన్నాయి... రెండురోజులు సమయం ఇవ్వండి ఖాళీ చేస్తామని బాధితుల వేడుకోలు.. అయినా.. పరిహారం ఇస్తాములే అంటూ ఆఘమేఘాలపై వైసీపీ హయాంలో అధికారులు తాడిమర్రిలో రోడ్డు విస్తరణ పేరుతో దాదాపు 85 మంది ఇళ్లను అధికారులు కూల్చివేశారు. 20 అడుగుల రోడ్డును 60 అడుగులకు విస్తరించారు. ఇది జరిగి దాదాపు 20 నెలలు అవుతోంది. నేటికీ ఆ బాధితులకు పరిహారం అందలేదు.

● ఎందుకీ విస్తరణ

అనంతపురం నుంచి పులివెందల వెళ్లే మార్గంలో పార్నపల్లి వద్ద అదానీ పవర్ ప్రాజెక్టు ఉంది. అనంతపురం నుంచి నిత్యం పలు వాహనాలు పార్నపల్లికు వెళ్తుంటాయి. ఈ పార్నపల్లి తాడిమర్రికి 18 కిలోమీటర్ల దూరంలో ఉంది. అనంతపురం నుంచి తాడిమర్రికి డబుల్ రోడ్డు (60 అడుగులు) ఉన్నా.. తాడిమర్రి నుంచి పార్నపల్లికి సింగిల్ రోడ్డు (12 అడుగులు) మాత్రమే ఉంది. ఈ సింగిల్ రోడ్డును విస్తరించేలా అధికారులు చర్యలు తీసుకోవడంతో దాన్ని వ్యతిరేకిస్తూ.. పలువురు కోర్టును ఆశ్రయించారు. దీంతో ఆ రోడ్డును విస్తరించరాదని కోర్టు ఆదేశాలు జారీ చేసింది. అయినా అధికారులు ఆ ఆదేశాలను ధిక్కరిస్తూ.. రోడ్డు విస్తరణ పనులకు పూనుకున్నారు. అది తాడిమర్రి నుంచి పార్నపల్లి మధ్య ఉన్న సింగిల్ రోడ్డు గురించి పట్టించుకోకుండా.. అధికారులు కేవలం తాడిమర్రిలో ఉన్న రోడ్డును మాత్రమే విస్తరించేలా చర్యలు తీసుకున్నారు. దీన్ని బాధితులు ప్రశ్నించినా అధికారులు దానికి సమాధానం చెప్పకుండా తమ పని కానిచ్చేశారు. కనీసం తమకు రెండు రోజులు గడువు ఇస్తే.. ఇళ్లను ఖాళీ చేసి వెళ్తామని బాధితులు అధికారుల వద్ద ఏకరువు పెట్టారు. అయినా ఫలితం లేకుండాపోయింది. ఆర్అండ్‌బీ, రెవెన్యూ, విద్యుత్‌శాఖ, పోలీసుశాఖ అధికారులు దగ్గరుండి మరీ ఆ ఇళ్లను కూల్చివేయించారు. ఇక తమ గోడు ఎవరితో చెప్పుకోవాలో అర్థం కాక.. బాధితులు నిస్సాయ స్థితిలో ఉండిపోయారు.

● మంత్రి హామీ

2024 ఎన్నికల ప్రచారంలో భాగం కూటమి అభ్యర్థి, నేటి మంత్రి సత్యకుమార్ యాదవ్ తాడిమర్రిలో పర్యటించారు. తమ సమస్యను ఈ బాధితులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఆయన తప్పనిసరిగా పరిహారం ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. ఇటీవల మంత్రి మళ్లీ తాడిమర్రికి వచ్చిన సందర్భంగా బాధితులు కలిసి మళ్లీ విజ్ఞప్తి చేశారు. త్వరలో ఇప్పిస్తానని హామీ మంత్రి మళ్లీ హామీ ఇచ్చారు. స్థానిక అధికారులు మాత్రం ఇంతవరకు ఎవరి ఇల్లు ఎంత విస్తీర్ణం పోయింది.. ఎంత నష్టం జరిగింది.. అన్న నివేదిక తయారు చేయలేదు. ఇప్పటికైనా పరిహారం విషయంలో పాలకులు, అధికారులు చిత్తశుద్ధితో వ్యవహరించాలని బాధితులు కోరుతున్నారు.

నష్టాన్ని అంచనా వేయాలి

తాడిమర్రిలో ప్రధాన రహదారి విస్తరణ వల్ల ఇళ్లు కోల్పోయిన వారి జాబితాను ఉన్నతాధికారులకు పంపాం. 85 మందికి సంబంధించిన వివరాలను పంపించాం. వీరిలో 39 మంది పరిహారం కోసం కోర్టుకు వెళ్లారు. వారి పేర్లను కూడా జాబితాలో కలిపి పంపించాం. అయితే ఎంత మేరకు నష్టపోయారన్న అంశాన్ని ఆర్అండ్‌బీ, హౌసింగ్ అధికారులు తేల్చాల్సి ఉంది.

- భాస్కర్‌రెడ్డి, తహసీల్దార్

వీధిన పడ్డాం



తాడిమర్రిలో రోడ్డు విస్తరణ వల్ల నష్టపోయిన వారిలో ఎక్కువ మంది వ్యాపారులే. ఒక్కసారిగా ఇళ్లను కూల్చడంతో వ్యాపారాలు పూర్తిగా మూతపడ్డాయి. ఇటు ఇళ్లు.. అటు వ్యాపారాలు కోల్పోయి వీధినపడ్డారు. కోలుకోవడానికి ఏడాది పట్టింది. పడగొట్టిన గదులను తయారు చేసుకుని తిరిగి నిలదొక్కుడానికి అప్పులు చేయాల్సి వచ్చింది. ఇప్పుడైన పరిహారం ఇస్తే మాకు కాస్త ఊరట ఉంటుంది.

- గంగాధర్‌గుప్తా, తాడిమర్రి

పాలకుల దృష్టికి తీసుకెళ్లాం



మాకు పరిహారం ఇప్పించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ కోరాం. త్వరలోనే పరిహారం ఇప్పించే ఏర్పాట్లు చేస్తామని వాళ్లు హామీ ఇచ్చారు. ఇళ్లు కోల్పోయిన వారికి ఇంటి స్థలం కూడా ఇప్పిస్తామని చెప్పారు. పరిహారం కోసం ఎదురుచూస్తున్నాం.

-హర్షవర్దన్, తాడిమర్రి

న్యూస్ బాక్స్

పాలిసెట్‌లో 94.03 శాతం ఉత్తీర్ణత

ధర్మవరం, మే 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పాలిటెక్నిక్ డిప్లమా ప్రవేశానికి నిర్వహించిన పాలిసెట్ ఫలితాల్లో 94.03 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ సురేశ్‌బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో బాలురు 2704, బాలికలు 1,989 మంది మొత్తం 4,693 మంది ఈ పరీక్షలు రాసినట్లు తెలిపారు. ఇందులో బాలురు 2,510, బాలికలు 1,903 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు.

పరిపాలన చేతకాకపోతే దిగిపోండి

సమావేశానికి వైసీపీ కౌన్సిలర్ల గైర్హాజరుపై టీడీపీ ధ్వజం



అధికారులను నిలదీస్తున్న కౌన్సిలర్ రత్నప్పచౌదరి

పుట్టపర్తి, మే 15(ఆంధ్రజ్యోతి): పరిపాలన చేతకాకపోతే తక్షణమే దిగిపోవాలని టీడీపీ ఫ్లోర్‌లీడర్ రత్నప్పచౌదరి ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ తుంగా ఓబుళపతి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. అయితే చైర్మన్ తప్పా మిగిలిన వైసీపీ కౌన్సిలర్లు అందరూ ఈ సమావేశానికి గైర్హాజరయ్యారు. రత్నప్ప చౌదరి మాట్లాడుతూ... ప్రజా సమస్యలు పాలక వర్గానికి ఏ మాత్రం పట్టిలేదని, ఇక ఈ సమావేశాలు ఎందుకు అని, పాలక వర్గాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వరుసగా మూడు సమావేశాలు జరపకపోతే ఆ పాలకవర్గాన్ని రద్దు చేయవచ్చని, దీనిని పరిగణలోకి తీసుకుని పాలకవర్గాన్ని రద్దు చేయాలని అధికారులను కోరారు. చైర్మన్, వైసీపీ కౌన్సిలర్లకు పరిపాలన, ప్రజాసమస్యలపై ఏ మాత్రం చిత్త శుద్ధి లేదన్నారు. సమావేశానికి హాజరైన టీడీపీ కౌన్సిలర్లు అందరూ అజెండాలో సంతకాలు చేయకుండా వెళ్లిపోయారు.

ప్రజాసమస్యలు పట్టవా..?

అధికారుల తీరుపై ఎంపీటీసీ ఆగ్రహం



అధికారులను నిలదీస్తున్న ఎంపీటీసీ శ్రీనివాసులు

ఓబుళదేవరచెరువు, మే 15(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు ఏ మాత్రం పరిష్కారం కావడం లేదని, ఇక ఈ సమావేశాలు నిర్వహించడం ఎందుకని వెంకటాపురం ఎంపీటీసీ శ్రీనివాసులు అధికారుల తీరుపై ఆగ్రహించారు. గురువారం ఎంపీపీ తుమ్మల ఫర్వీన్ అధ్యక్షతన ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఇందులో ఎంపీటీసీ మాట్లాడుతూ.. వెంకటాపురం పంచాయతీలో పాఠశాల భవనాలు నిరుపయోగంగా ఉన్నాయని, వాటిని ప్రభుత్వ కార్యక్రమాలకు వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పల్లె పండుగ కింద సీసీ రోడ్లు, మినీగోకులాలు ఏర్పాటు చేశామని, ఇంతవరకు బిల్లులు రాకపోవంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. దీనికి స్పందించి ఎంపీడీఓ రాబర్టువిల్సన్ మాట్లాడుతూ బిల్లులు రావాల్సి ఉందని, రాగానే వారి వారి ఖాతాల్లో జమ అవుతాయని అన్నారు. సమావేశంలో తహసీల్దార్ అనంతచారి, వైస్ ఎంపీపీ లక్ష్మీదేవి, ఏపీఎం మంజుల, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయకుమారి, హెచ్‌ఓ లావణ్యం, ఏఓ ఇలియాజ్ అహమ్మద్, పశువైద్యాధికారి ప్రవీణ్ పాల్గొన్నారు.

పరిశుభ్రతను పాటించండి

పుట్టపర్తిరూరల్, మే 15 (ఆంధ్రజ్యోతి): వర్షకాలం సమీపిస్తున్న నేపథ్యంలో ప్రతిఒక్కరూ శుభ్రమైన ఆహారాన్నే తీసుకోవాలని, ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సామాజిక ఆరోగ్య అధికారి నగేష్ సూచించారు. గురువారం మండలంలోని నిడిమామిడి గ్రామం పుట్టపర్తి చిత్రావతి రోడ్డులో అతిసార, క్షయవ్యాధులపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రెండు వారాలకు మించి దగ్గుపడటం, గళ్ళపడటం, బరువు తగ్గడం తదితర లక్షణాలు ఉంటే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో డీటీసీ సూపర్‌వైజర్ అబిద్‌బాషా, సూపర్‌వైజర్ చంద్రకళ, ఆరోగ్యకార్యకర్తలు మంజులవాణి, జ్యోతి పాల్గొన్నారు.

ప్రతిరైతుకు అన్నదాతా సుఖీభవ వర్తింపజేయాలి

ధర్మవరంరూరల్, మే15(ఆంధ్రజ్యోతి): అర్హత ఉన్న ప్రతిరైతుకు అన్నదాత సుఖీభవ పథకాన్ని వర్తింపజేయాలని టీడీపీ క్లస్టర్ ఇన్‌ఛార్జ్ మహేష్‌చౌదరి అధికారులను కోరారు. గురువారం పట్టణంలోని ఏఓ కార్యాలయంలో మండల ఏఓ ముస్తాఫ, గ్రామ వ్యవసాయ అధికారులతో సమావేశం నిర్వహించారు. రైతులందరికీ న్యాయం చేయాలని, అర్హత ఉన్న ఏ రైతుకు అన్యాయం జరగరాదని అన్నారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి విజయసారథి పాల్గొన్నారు.

రస్తా సమస్య పరిష్కారం

నంబులపూలకుంట, మే 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని బలిజపల్లి గ్రామ సచివాలయం రస్తా సమస్యను గురువారం అధికారులు పరిష్కరించారు. గతంలో ఈ రస్తా విషయంలో పలు ఘర్షణలు జరిగాయి. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు కూడా చేసుకున్నారు. ప్రస్తుతం సీసీ రోడ్డు మంజూరైంది. ఆ పనులను అడ్డుకోవడంతో గురువారం తహసీల్దార్ దేవేంద్రనాయక్, ఎంపీడీఓ పార్థసారధి, ఎస్‌ఐ వలీబాషా, పోలీస్ సిబ్బంది వెళ్లి సమస్యను పరిష్కరించారు. ఎక్స్‌కవేటర్‌తో ఆ భూమిని చదును చేయించారు.

తల్లీకొడుకు అదృశ్యంపై కేసు నమోదు

ధర్మవరం, మే 15(ఆంధ్రజ్యోతి): స్థానిక ఇందిరమ్మ కాలనీకి చెందిన ఉమామహేశ్వరి, ఆమె కుమారుడు ధనుష్‌కుమార్ కనిపించకుండా పోవడంపై కేసు నమోదు చేసినట్టు టూటౌన్ సీఐ రెడ్డప్ప గురువారం తెలిపారు. ఉమామహేశ్వరి, ధనుష్‌కుమార్‌లు ఈనెల 11వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లారు. తిరిగి రాకపోవడంతో బంధువులు, తెలిసిన వారి ఇళ్ల వద్ద వెతికినా ప్రయోజనం లేదు. దీంతో ఉమామహేశ్వరి తండ్రి గురుమూర్తి గురువారం తన కుమార్తె, మనవడు కనిపించట్లేదని ఫిర్యాదు చేశారు. ఆ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

● బాలిక అదృశ్యం

బత్తలపల్లి : మండలంలోని ఓ గ్రామానికి చెందిన 13 ఏళ్ల బాలిక అదృశ్యమైనట్లు ఎస్‌ఐ సోమశేఖర్ గురువారం తెలిపారు. బుధవారం బాలిక కనిపించకుండా పోవడంతో గ్రామంలో, బంధువుల ఇళ్ల వద్ద వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో బాలిక తల్లిదండ్రులు.. బత్తలపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

● మహిళ అదృశ్యం

కదిరిఅర్బన్ : మహిళ అదృశ్యంపై గురువారం కేసు నమోదు చేసినట్లు రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. కుమ్మరవాండ్లపల్లిలో నివాసముంటున్న అల్లుగుండు రవీచంద్ర భార్య మహేశ్వరీ బుధవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. తెలిసిన వారు, బంధువుల వద్ద విచారించినా ఆచూకీ లభించలేదు. ఆమె భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని .. దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు

తాగునీటి సమస్య పరిష్కారం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అమడగూరు (కదిరి), మే 15(ఆంధ్రజ్యోతి): అమడగూరు మండలంలోని ఇద్దేవాండ్లపల్లిలో పది రోజుల క్రితం పంచాయతీ బోరు మోటర్ చెడిపోవడంతో ఆ గ్రామస్థులు తాగునీటి ఎద్దడితో ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ఆంధ్రజ్యోతి గురువారం ఓ కథనాన్ని ప్రచురించింది. స్పందించిన ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ అనిల్‌కుమార్, కార్యదర్శి సునీయా ఆ గురువారం ఆ బోరుకు కొత్త మోటరు ఏర్పాటు చేసి.. తాగునీటిని సరఫరా చేశారు. దీంతో సమస్య పరిష్కారమైంది.



బోరుకు మోటారు అమర్చుతున్న సిబ్బంది

మసీదుకు ఎమ్మెల్యే స్థల విరాళం



స్థల దస్తావేజులు అందచేస్తున్న టీడీపీ నాయకులు

కదిరి, మే 15(ఆంధ్రజ్యోతి): తలుపుల మండలంలోని పెద్దన్నవారిపల్లిలో మసీదు నిర్మాణానికి అవసరమైన రూ. రెండు లక్షల విలువైన స్థలాన్ని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ కొనుగోలు చేసి.. విరాళంగా ఇచ్చారు. ఇటీవల ఆ గ్రామస్థులు ఎమ్మెల్యేను కలిసి మసీదుకు అవసరమైన స్థలాన్ని ఇవ్వాలని కోరారు. దీంతో ఎమ్మెల్యే షేక్ బాషాకు స్థలాన్ని రూ. రెండు లక్షలకు కొనుగోలు చేసి.. దానిని ఆ గ్రామస్థులకు అందజేశారు. అందుకు సంబంధించిన దస్తావేజులను టీడీపీ నాయకుడు మేడా శంకర్ గురువారం ఆ గ్రామస్థులకు అందజేశారు. కార్యక్రమంలో అబీబ్‌బాషా, కుళ్లాయప్ప, మదార్‌వలీ, హైదర్‌వలీ, నారాయణ, మల్లేష్, సోము, గంగరాజు, మల్లినాయుడు పాల్గొన్నారు.

పిల్లలను భవిత కేంద్రాల్లో చేర్పించాలి

బుక్కపట్నం, మే 15(ఆంధ్రజ్యోతి): ప్రత్యేక అవసరాలతో బాధపడుతున్న పిల్లలను గుర్తించి వారిని భవిత కేంద్రాల్లో చేర్పించాలని ఎస్ఎస్ఏ (అడిషనల్) ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ దేవరాజ్ పేర్కొన్నారు. గురువారం మండలకేంద్రంలో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలపై జరుగుతున్న సర్వేను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. ఐఈఆర్పీలు ఇంటింటికెళ్లి వినికిడి లోపం, నిర్దిష్ట అంగవైకల్యం తదితర సమస్యలతో బాధపడుతున్న పిల్లలను గుర్తించి ఆయా పాఠశాలలో చేర్పించాలని కోరారు. అలాగే వారికి సదరమ్ కార్డు నమోదు చేసి సర్టిఫికెట్ వచ్చేలా చేయాలన్నారు. తల్లిదండ్రులు కూడా పిల్లలు భవితకేంద్రాలకు వెళ్లేలా ప్రోత్సహించాలన్నారు. ఇలాంటి పిల్లలకు ప్రభుత్వం పలురకాల పథకాలు అందిస్తోందన్నారు. ఆయన వెంట ఐఈఆర్పీలు అరుణ, మల్లికార్జున ఉన్నారు.



సర్వేలో బాలుడితో మాట్లాడుతున్న దేవరాజ్

తెలుగు మహిళ మండల అధ్యక్షురాలిగా సుభాషిణి



సుభాషిణిని సన్మానిస్తున్న నాయకులు

ఓబుళదేవరచెరువు, మే 15(ఆంధ్రజ్యోతి): తెలుగు మహిళ మండల అధ్యక్షురాలిగా జంబుల సుభాషిణిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం స్థానిక టీడీపీ కార్యాలయంలో కన్వీనర్ శెట్టివారి జయచంద్ర ఆధ్వర్యంలో ఈ ఎన్నిక జరిగింది. ఆమెను నాయకులు షానూ, రాయల్‌కుమార్, సునీల్‌కుమార్, ప్రమీల, బూత్ కన్వీనర్ విజయ్ సన్మానించారు.

● మైనార్టీ సెల్ కార్యవర్గం ఏకగ్రీవం



అధ్యక్షకార్యదర్శులు

ఓబుళదేవరచెరువు మండల మైనార్టీ సెల్ కార్యవర్గాన్ని గురువారం టీడీపీ కార్యాయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల మైనార్టీ అధ్యక్షుడు తుమ్మలకుంట్లపల్లి ఇర్షాన్, ప్రధాన కార్యదర్శి ఓడీసీ తుమ్మల అబ్లును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు కన్వీనర్ జయచంద్ర తెలిపారు. ఎస్టీసెల్ మండలాధ్యక్షుడిగా తిప్పేపల్లికి చెందిన మూడే రామాంజునేయులనాయక్, ఉపాధ్యక్షుడిగా ఇనగలూరు సురేష్‌నాయక్, ప్రధాన కార్యదర్శిగా శేయ్యగారిపల్లికి చెందిన సత్యనారాయణ నాయక్‌ను ఎన్నుకున్నట్లు కన్వీనర్ తెలిపారు.

స్పోకెన్ ఇంగ్లిష్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న టీచర్ వెన్నెల

ధర్మవరం, మే 15(ఆంధ్రజ్యోతి): ధర్మవరం శాఖా గ్రంథాలయంలో స్పోకెన్ ఇంగ్లీషుపై విద్యార్థులకు ఉపాధ్యాయురాలు వెన్నెల గురువారం అవగాహన కల్పించారు. విద్యార్థులు మాతృభాష తెలుగుతో పాటు ఇంగ్లీష్‌పై దృష్టి సారించాలన్నారు. మొదట ఇంగ్లీష్‌పై భయం వీడితే నేర్చుకోవడం చాలా సులభమన్నారు. ఇంగ్లీష్ నేర్చుకోవడం వల్ల భవిష్యత్‌లో ఉపాధి పొందడం సులభతరం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి అంజలి సౌభాగ్యవతి, సిబ్బంది రమణనాయక్, సత్యనారాయణ, శివమ్మ, గంగాధర్, పాఠకులు పాల్గొన్నారు.



విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ ఉమ్మడి జిల్లాలో మూడు రోజుల పర్యటనలో భాగంగా గురువారం గుత్తి పట్టణానికి హెలీకాప్టర్‌లో చేరుకున్నారు. ఆయనకు టీడీపీ జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి ఘన స్వాగతం పలికారు.

క్రైం న్యూస్..

యువతిపై వేధింపులు... ముగ్గురిపై కేసు

ధర్మవరం, మే 15(ఆంధ్రజ్యోతి): స్థానిక కేతిరెడ్డికాలనీకి చెందిన షమీర్, అతని మిత్రులు శ్రీనాథ్, అస్లీం తన వెంట పడి వేధిస్తున్నారని ఓ యువతి టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేసింది. ఆ ఫిర్యాదు మేరకు ఆ ముగ్గురిపై కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

కారు దగ్ధం



దగ్ధమవుతున్న కారు

ధర్మవరంరూరల్, మే15(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిగిచెర్ల సమీపంలో అనంతపురం నుంచి ధర్మవరం వెళ్తున్న ఓ కారులో మంటలు చేలరేగి.. కారు పూర్తిగా దగ్ధమైన సంఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. అనంతపురానికి చెందిన వెనీల్ తన కారులో ధర్మవరం బయలుదేరాడు. చిగిచెర్ల గ్రామ సమీపంలోకి రాగానే ఉన్నఫళంగా కారులో ముందుభాగం నుంచి పొగలు వచ్చాయి. వెంటనే కారు పక్కకు ఆపి ఇంజన్ చెక్‌చేయగా ఇంజిన్‌లో నుంచి మంటలు వ్యాపించాయి. దీంతో ఆ కారు పూర్తిగా దగ్ధమైంది. రూరల్ పోలీసులు విచారణ చేపట్టారు.



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్థులు

ఆర్డీటీ ఎఫ్‌సీఆర్ఏను రెన్యువల్ చేయాలి

ఓబుళదేవరచెరువు, మే 15(ఆంధ్రజ్యోతి): ఆర్డీటీకి విదేశీ నిధులు అందేలా కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌సీఆర్ఏను రెన్యువల్ చేయాలని మామిళ్లకుంట్లపల్లి గ్రామస్థులు విజ్ఞప్తి చేశారు. గురువారం ఈ మేరకు వారు స్థానిక డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరెడ్డికి వినతి పత్రం అందజేశారు. పేదలకు అండగా ఉంటున్న ఆర్డీటీ సంస్థకు విదేశీ నిధులు రాకుండా అడ్డుకోవడం బాధాకరమన్నారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో ఆ గ్రామస్థులు నాగేళ్ల బావన్న, అంజనప్ప, లక్ష్మీనరమ్మ, చంద్రకళ, సాలెమ్మ, లక్ష్మమ్మ, కాంతమ్మ ఉన్నారు.

● ముదిగుబ్బ : ఆర్డీటీ సంస్థకు విదేశీ నిధులు అందేలా ఎఫ్‌సీఆర్ఏను రెన్యువల్ చేసేలా కేంద్రప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ మండల కన్వీనర్ బాసినేని ప్రభాకర్ కోరారు. గురువారం స్థానికంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. విదేశీ నిధులు అందకపోవడంతో భవిష్యత్‌లో ఆర్డీటీ సంస్థ సేవలు ఆగిపోయే ప్రమాదముందని ప్రజలు ఆందోళన పడుతున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నిషార్ అహ్మద్, ఆదినారాయణ, నాగరాజు, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

18 నుంచి బోగాదమ్మ ఉత్సవాలు



గాండ్లపెంట, మే 15(ఆంధ్రజ్యోతి) : మండలంలోని సాదులవాండ్లపల్లిలో ఆదివారం నుంచి మూడు రోజుల పాటు బోగాదమ్మ ఆలయ ద్వితీయ వార్షికోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు గురువారం తెలిపారు. ఆదివారం ఉదయం 7 గంటలకు అమ్మవారికి అభిషేకం, హోమం, మహామంగళహారతి, రాత్రి నెల్లూరు వారిచే ఆర్కెస్ట్రా, సోమవారం అమ్మవారికి హోమాలు, కలిశాభిషేకం, రాత్రికి అమ్మవారి ఉత్సవ విగ్రహం ఊరేగింపు, మంగళవారం తెల్లవారుజామున ఐదు గంటల నుంచి జ్యోతులు, బోనాలు, సాయంత్రం చెక్కభజనలు నిర్వహిస్తామన్నారు.

సమ్మెను విజయవంతం చేయాలి

- సీఐటీయూ నాయకులు



కియ పరిశ్రమ వద్ద సమ్మె నోటీసు అతికిస్తున్న నాయకులు

పెనుకొండ రూరల్ మే 15(ఆంధ్రజ్యోతి): కార్మిక సంఘాలు మే20న చేపట్టిన దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ పెనుకొండ వద్ద ఉన్న కియా కార్ల పరిశ్రమ వద్ద సీఐటీయూ నాయకులు నోటీసును అంటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం 29కార్మిక చట్టాలను సవరించి నాలుగు లేబర్‌కోడ్ తీసుకొచ్చి కార్మికుల హక్కులను హరిస్తోందన్నారు. ఈ లేబర్‌కోడ్ అమలైతే కార్మికులకు సంఘం పెట్టుకునే అవకాశం లేకుండా పోతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా చేపడుతున్న సమ్మెలో అన్నిరంగాల ఉద్యోగ, కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి హరీష్, సాంబశివ, బాబావలి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అధిక పనిదినాలు కల్పించండి: పీడీ



రంగనాథప్ప గోకులం షెడ్డును పరిశీలిస్తున్న పీడీ, ఏపీడీ

అగళి, మే 15(ఆంధ్రజ్యోతి): మహాత్మా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు అధిక పనిదినాలు కల్పించాలని పీడీ విజయేంద్ర ఆదేశించారు. ఫీల్డ్ అసిస్టెంట్లు ఆ మేరకు నిర్వహణ చేయాలని సూచించారు. గురువారం అగళి మండలంలో ఆయన పర్యటించారు. తొలుత రామనపల్లి గ్రామంలో రైతు రంగనాథప్ప నిర్మించిన గోకులం షెడ్డును పీడీ విజయేంద్ర, ఏపీడీ లక్ష్మీనారాయణ పరిశీలించారు. రైతు నిర్మించిన షెడ్డు నాణ్యతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ మండలానికి సంబంధించి 200 ఎకరాల్లో పండ్లతోటల పెంపకం చేపట్టాలన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు గ్రామ పంచాయతీలో ఇచ్చిన టార్గెట్‌ను పూర్తిచేయాలని, చేయనిపక్షంలో వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. అధిక సంఖ్యలో కూలీలకు పనులు కల్పించాలన్నారు. హార్టికల్చర్ ప్రోగ్రాం కింద మామిడిచెట్లు, దానిమ్మ, కొబ్బరి, నిమ్మ, మల్లెపూలు, మొక్కలు రైతులతో మాట్లాడి అందజేయాలన్నారు. పంచాయతీలకు ఇచ్చిన నివేదిక ప్రకారం పనులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ మంజునాథ్, టెక్నికల్ అసిస్టెంట్ రమేష్, ఈరప్ప, దేవగిరి ఈరన్న, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ముందస్తు అడ్మిషన్లపై చర్యలు తీసుకోండి

- ఎంఈఓకు వినతి



ఎంఈఓకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

మడకశిర టౌన్, మే15(ఆంధ్రజ్యోతి): మండలవ్యాప్తంగా ఉన్న పాఠశాలలు, కళాశాలలో ముందస్తు అడ్మిషన్లను ఆపాలని, అలాంటి పాఠశాలలు, కళాశాలలపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘం నాయకులు గురువారం ఎంఈఓ శ్రీనివాస్ భాస్కర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. పీడీఎస్‌యు సంఘం జిల్లా అధ్యక్షులు ఉమేష్, సంఘం నాయకులతో వినతిపత్రం ఇచ్చారు. అనంతరం మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థలు ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇప్పటికే అడ్మిషన్లు ప్రారంభించడం జరుగుతోందన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధిక ఫీజు వసులు చేస్తున్నారన్నారు, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న పాఠశాలలు, కళాశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు, కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ అధ్యక్షులు ఎంఆర్ హనుమంతు, సీపీఐ నాయకులు ఆర్‌జి పవిత్ర తదితరులు పాల్గొన్నారు.

గుడిబండలో మోస్తరు వర్షం

గుడిబండ, మే 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్‌రాయాపురం, పూజారిపల్లి, మేకలగట్ట, ఎస్‌ఎస్‌గుండ్లు, తదితర గ్రామాల్లో గురువారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. వేసవి ఎండలు విపరీతంగా ఉన్న నేపథ్యంలో వర్షం కురవడంతో ఎండ వేడిమి తగ్గుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

డీఎస్పీ తనిఖీ



చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న డీఎస్పీ

అగళి, మే 15(ఆంధ్రజ్యోతి): మండల పోలీస్‌స్టేషన్‌ను పెనుకొండ డీఎస్పీ నర్సింగప్ప గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలించి పాత కేసులపై ఆరాతీశారు. అనంతరం కర్ణాటక ప్రాంతం సమీపంలో ఉన్న నందరాజనపల్లి, కదిరేపల్లి వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులను తనిఖీ చేశారు.
సిబ్బందికి సలహాలు, సూచనలు ఇచ్చారు. ఇసుక అక్రమ రవాణా, కర్ణాటక మద్యం, అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చర్యలు చేపట్టాలని సీఐ రాజకుమార్‌కు సూచించారు. అదేవిధంగా విధులను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. డీఎస్పీ వెంట ఏఎస్ఐలు బషీర్, కానిస్టేబుల్ శివ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

అమరాపురం, మే 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని హందుగూరు కాచికుంట మార్గ మధ్యలో ద్విచక్రవాహనం అదుపుతప్పి నవీన్‌కుమార్ అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. నవీన్‌కుమార్ రెండు నెలలుగా బెంగళూరులో పనిచేస్తున్నాడు. గుడ్డలపల్లిలోని తన భార్య వద్దకు వస్తుండగా హందగూరు కాచగుంట మార్గ మధ్యలో ద్విచక్రవాహనం అదుపుతప్పి అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సచివాలయంలో అందుబాటులోలేని సిబ్బంది

- ఫీల్డ్ విజిట్ పేరిట డుమ్మా
- ఇబ్బందిపడుతున్న లబ్ధిదారులు

ఆంధ్రజ్యోతి విజిట్



సచివాలయం బయట చెట్టుకింద బిజీగా ఇంజనీరింగ్ అసిస్టెంట్



సచివాలయంలో ఫోన్‌లో బిజీగా వెల్ఫేర్ అసిస్టెంట్

సోమందేపల్లి, మే 15(ఆంధ్రజ్యోతి): నిత్యం అందబాటులో ఉండాల్సిన సచివాలయ సిబ్బంది ఫీల్డ్‌విజిట్ పేరిట విధులకు డుమ్మా కొడుతున్నారని ప్రజలు అంటున్నారు. రైతులకు వివిధ రకాల సేవలు అవసరమవుతాయి. అంతేకాకుండా కొత్తరేషన్ కార్డుల మార్పులు చేర్పుల గురించి అనేక మంది సచివాలయాలకు వస్తూపోతుంటారు. సిబ్బంది సమయపాలన పాటించకపోవడంతోపాటు ఎప్పుడుంటారో ఎప్పుడు వెళ్తారో తెలియక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గురువారం మండలంలోని గుడిపల్లి సచివాలయాన్ని ఆంధ్రజ్యోతి విజిట్ చేసింది. కార్యాలయంలో అడ్మిన్‌తో పాటు వీఆర్‌ఓ, సర్వేయర్, మహిళా పోలీస్, హార్టికల్చర్, సిరికల్చర్, పశుసంవర్ధకశాఖ, విద్యుత్, వెల్ఫేర్, ఇంజనీరింగ్ తదితరశాఖలకు సంబంధించిన సిబ్బంది ఉండాల్సి ఉండగా వెల్ఫేర్ అసిస్టెంట్ శ్రీదేవి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ మాత్రమే కనిపించారు. వెల్ఫేర్ అసిస్టెంట్ సచివాలయంలో ఫోన్‌లో మాట్లాడుతూ బిజీగా ఉండగా ఇంజనీరింగ్ అసిస్టెంట్ కార్యాలయం బయట చెట్టుకింద ఫోన్‌లో కాలక్షేపం చేస్తూ కనిపించారు. ఎవరు వస్తున్నారో ఎవరు పోతున్నారో గమనించలేనంత బిజీగా ఫోన్‌లో మాట్లాడటం కనిపించింది. మిగిలినవారు విధులకు రాలేదా అని అడిగితే ట్రైనింగ్, కార్యాలయాల పనులకోసం కొంతమంది వెళ్లగా మిగిలినవారు ఫీల్డ్‌కు వెళ్లారని సమాధానం ఇచ్చారు. ఇంతకు వారు కార్యాలయాలకు వెళ్తున్నారో లేదో ఫీల్డ్‌విజిట్ పేరుతో డుమ్మా కొడుతున్నారో అర్థంకాని పరిస్థితి నెలకొందని స్థానికులు పేర్కొంటున్నారు. సచివాలయంలో అందరూ ఒక్కసారిగా లేకుండా పోతున్నారని, సిబ్బంది విధులకు సరిగా హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని రైతులు, స్థానికులు కోరుతున్నారు. కాగా సిబ్బంది విషయమై ఎంపీడీఓ వెంకటలక్ష్మిని వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆమె ఫోన్‌లో అందుబాటులోకి రాలేదు.

నిధులు కేటాయిస్తేనే అభివృద్ధి సాధ్యం

ఆర్థిక సంఘం సమావేశంలో పురం మున్సిపల్ చైర్మన్



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ రమేష్

హిందూపురం, మే 15(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థలకు పెద్దఎత్తున నిధులు కేటాయిస్తేనే అభివృద్ధి సాధ్యం అవుతుందని హిందూపురం మున్సిపల్ చైర్మన్ రమేష్ కోరారు. గురువారం తిరుపతిలో 16వ ఆర్థిక సంఘం సమావేశం జరిగింది. దీనికి రాయలసీమ నుంచి మునిసిపల్ చైర్మన్ హాజరయ్యారు. సమావేశంలో రమేష్ మాట్లాడుతూ ఆర్థిక సంఘం ప్రతినిధులకు ప్రతిపాదనలు తెలిపారు. 15వ ఆర్థిక సంఘంలో మున్సిపాలిటీలకు కేటాయించిన నిధులు టైడ్, నాన్‌టైడ్ గ్రాంట్‌లు విధించారని నాన్‌టైడ్ గ్రాంట్‌లో మున్సిపాలిటీల అభివృద్ధి కోసం రోడ్లు, కాలువల నిర్మాణం చేయిస్తే మునిసిపాలిటీలు ఇప్పటికే బకాయిలుపడ్డ, విద్యుత్ చార్జీలు, ఇతరత్ర అప్పులకు జమ అవుతున్నాయన్నారు. 16వ ఆర్థిక సంఘం నిధులైనా ఎలాంటి షరతులు లేకుండా కేవలం అభివృద్ధి పనులకే వాడుకునేలా మార్పు చేయాలన్నారు. అనేక మున్సిపాలిటీలకు విద్యుత్ చార్జీలు పెనుభారంగా మారుతున్నాయని, వచ్చే ఆదాయంలో ఎక్కువశాతం విద్యుత్ చార్జీలకే సరిపోతోందని వివరించారు. ప్రభుత్వం విద్యుత్ చార్జీల బకాయిలు ఒకే విధానం చెల్లించి స్థానిక సంస్థలకు ఊరట కలిగించాలన్నారు. జనాభాకు అనుగుణంగా పట్టణాల్లో విస్తరణకు అనుగుణంగా ఆర్థిక సంఘం నిధులు కేటాయించాలన్నారు. దీనివల్ల కొత్త కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించే అవకాశం ఉంటుందన్నారు. ముఖ్యంగా ప్రభుత్వం నుంచి వచ్చే స్టాంప్ డ్యూటీలు, సర్‌చార్జీలు నేరుగా స్థానిక సంస్థల ఖాతాలోకి జమచేసేలా చూడాలన్నారు. అభివృద్ధి పనుల్లో ప్రభుత్వానికి చెల్లించే 18 శాతం జీఎస్టీని మినహాయించాలన్నారు. మాస్టర్‌ప్లాన్‌కు అనుగుణంగా జరిగే రోడ్డు విస్తరణలో ఆర్థిక సంఘం నుంచి అధిక నిధులు మంజూరు చేయాలని కోరారు.

సద్దుమణిగిన వివాదం

- ఇరువర్గాల ఉద్యోగుల సమావేశం

హిందూపురం, మే 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎన్‌జీఓ క్యాంటిన్ వివాదం ఓ కొలిక్కి వచ్చింది. పట్టణంలోని నడిబొడ్డున 1995 తహసీల్దార్ కార్యాలయం వద్ద ఎన్జీఓ క్యాంటిన్ ప్రారంభించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎన్‌జీఓల ఆధీనంలోనే ఉంది. అయితే ఇటీవల అమరావతి జేఏసీ జిల్లా అధ్యక్షులుగా హిందూపురం డిప్యూటీ తహసీల్దార్ షైనుద్దీన్ ఎన్నికయ్యారు. దీంతో ఎన్జీఓ క్యాంటిన్ స్థలం రెవెన్యూకు సంబంధించిందని ఎన్జీఓ క్యాంటిన్‌కు రెవెన్యూ క్యాంటిన్‌గా పేరుమార్చారు. దీంతో నెలరోజులుగా ఈ వివాదం ఎన్జీఓలు అమరావతి జేఏసీ (రెవెన్యూ) అధికారుల మధ్య రచ్చ సాగింది. ఈ విషయాన్ని ఎన్జీఓలు ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ దృష్టికి తీసుకెళ్లారు. ఎన్జీఓ సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు గురువారం హిందూపురానికి చేరుకుని రెవెన్యూ క్యాంటిన్‌గా ఉన్న బోర్డును తొలగించి ఎన్జీఓ క్యాంటిన్‌గా ఫ్లెక్సీ అతికించారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు ఎన్జీఓ క్యాంటిన్ వద్దకు వెళ్లి ఆ ఫ్లెక్సీలు తొలగించి రెవెన్యూ ఫ్లెక్సీగా వేసేందుకు సిద్ధమయ్యారు. అప్పటికే హిందూపురంలో ఉన్న ఎన్జీఓ సంఘం నాయకులు అక్కడకు చేరుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంటుందని భావించారు. ఏన్జీఓలు, అమరావతి జేఏసీ నాయకులు సమావేశమై ఈ సమస్యను రాష్ట్ర నాయకుల దృష్టికి తీసుకెళ్దామని అక్కడ వారు ఏం నిర్ణయిస్తే దానికి ఇరువర్గాలు కట్టబడి ఉండాలని తీర్మానించారు. సమావేశంలో ఎన్జీఓ సంఘం రాష్ట్ర నాయకులు మాధవ్, జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్‌రెడ్డి, కార్యదర్శి చంద్రమోహన్, ప్రసాద్, లింగమేశ్, ప్రవీణ్, తాలూకా ఎన్జీఓ సంఘం అధ్యక్షులు నరసింహులు, జంపన్న, వేణుగోపాల్‌రెడ్డి, అమరావతి జేఏసీ నాయకులు షైనుద్దీన్ పాల్గొన్నారు. నెలరోజులుగా సాగిన వివాదం ఎట్టకేలకు సద్దుమణిగినట్లు అయింది.

రక్త నమూనాల సేకరణ



రక్త నమూనాలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది

అగళి, మే 15(ఆంధ్రజ్యోతి): బోధకాల వ్యాధి నివారణకు అగళి పీహెచ్‌సీలోని రామాపురం గ్రామంలో మలేరియా సబ్‌యూనిట్ అధికారి షమీవుల్లా, సూపర్‌వైజర్ నర్సారెడ్డి ఆధ్వర్యంలో గురువారం రక్తనమూనాలు సేకరించారు. 300మంది నుంచి రక్త నమూనాలు తీసుకున్నారు. రాత్రి సమయంలో సేకరించిన రక్త నమూనాల ద్వారా మాత్రమే వ్యాధిని నిర్ధారించవచ్చని వైద్యుడు శివానంద తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ లక్ష్మీదేవి, సూపర్‌వైజర్ జయమ్మ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగప్రతిష్ఠ



నాగుల ప్రతిష్ఠలో పాల్గొన్న వేదపండితులు

పెనుకొండ, మే 15(ఆంధ్రజ్యోతి): దక్షిణకాశీగా పేరుగాంచిన పట్టణంలోని శ్రీకాశీ విశ్వేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో గురువారం భక్తిశ్రద్ధలతో నాగప్రతిష్ఠ మహోత్సవాన్ని నిర్వహించారు. వంశీకృష్ణ సహకారంతో అందజేసిన నాగులను వేదబ్రాహ్మణుల సమక్షంలో ప్రాణప్రతిష్ఠ చేశారు. ఉదయం నుంచి ప్రత్యేక హోమాలు నిర్వహించారు.

పిడుగుపాటుకు గొర్రెలు మృతి

మడకశిర రూరల్, మే 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని బుళ్లసముద్రం పంచాయితీ బీ రాయపురం గ్రామానికి చెందిన హనుమంతేగౌడ్‌కి చెందిన రెండు గొర్రెలు గురువారం సాయంత్రం పిడుగుపాటుకు మృతి చెందాయి. సాయంత్రం ఐదు గంటల సమయంలో ఉరుములు, మెరుపులు అధికంగా ఉండడంతో పొలాల్లో ఉన్న గొర్రెలను ఇంటికి తీసుకెళ్తుండగా ఒక్కసారిగా మెరుపు మెరిసి గొర్రెలపై పిడుగు పడిందని, రెండు గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందినట్లు హనుమంతేగౌడ్ తెలిపారు. తనకు ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

డిప్యూటీ ఎంపీడీఓ మృతి

పరిగి, మే 15(ఆంధ్రజ్యోతి): కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ బాగేపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ డిప్యూటీ ఎంపీడీఓ శ్రీధర్(50) బుధవారం రాత్రి తుదిశ్వాస వదిలారు. విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు ముద్దలపల్లికి వెళ్లి ఆయన మృతదేహానికి నివాళులు అర్పించారు. బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవిత మృతుని భార్యను ఫోన్‌లో ఓదార్చారు. డాక్టర్ సురేష్, మారుతిప్రసాద్, కార్యదర్శులు తిప్పన్న, ఆనంద్, ఆదినారాయణ, తిలక్, ప్రవీణ్‌రెడ్డి, మహేశ్వర్‌రావు తదితరులు నివాళులు అర్పించారు.


ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

హిందూపురం, మే 15(ఆంధ్రజ్యోతి): వాల్మీకి కులానికి చెందిన పది, ఇంటర్‌లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు ఇస్తున్నట్లు ఆ ఉద్యోగ సంఘం నాయకులు గురువారం ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులు 450మార్కులపై, ప్రైవేట్‌పాఠశాలలో 500మార్కులపైన, ఇంటర్మీడియట్ ప్రభుత్వ కళాశాల 750మార్కులకుపైన ప్రైవేట్ కళాశాల 850మార్కులపైన సాధించిన వారు అర్హులన్నారు. హిందూపురం, పరిగి, చిలమత్తూరు, లేపాక్షి మండలాలకు సంబంధించిన విద్యార్థులు ఈనెల 18లోగా నమోదుచేసుకోవాలన్నారు. విద్యార్థులు తమ వివరాలను 9441665692, 7780583140కు వాట్సాప్ ద్వారా పంపించాలని వాల్మీకి ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు విజయ్‌కుమార్, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి శివన్న, జిల్లా ఉపాధ్యక్షులు నారాయణస్వామి, గౌరవ సలహాదారు నరసింహులు, అధ్యక్ష, కార్యదర్శులు జనార్దన్, రవిశేఖర్, కోశాధికారి రామక్రిష్ణ తెలిపారు.

పారాలీగల్ వలంటీర్లకు..

హిందూపురం, మే 15(ఆంధ్రజ్యోతి): చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించే నిమిత్తం రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు పారా లీగల్ వలంటీర్ల నియామకం కోసం దరఖాస్తు చేసుకోవాలని అదనపు జిల్లా న్యాయాధికారి కంపల్లె శైలజ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హిందూపురం ప్రాంతంలోని మారుమూల గ్రామాల్లో చట్టాలపై అవగాహన కల్పించేందుకు సీనియర్ సిటిజన్లు, దివ్యాంగులు, హిజ్రాలు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. టెన్త్ ఆపై చదివిన వారు అర్హులన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 24లోపు దరఖాస్తులను రెండవ అదనపు జిల్లా న్యాయాధికారి న్యాయ సముదాయంలో ఉన్న లోక్‌అదాలత్ విభాగంలో దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత బెల్లాలచెరువు



ట్రోఫీ అందుకుంటున్న విజేత బెల్లాలచెరువు జట్టు

గోరంట్ల, మే15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో జ్వాలా పెయింట్స్ నిర్వాహకుడు ప్రతాప్ నిర్వహించిన క్రికెట్ టోర్నీలో బెల్లాలచెరువు జట్టు విన్నరుగాను, గోరంట్ల జట్టు రన్నరుగాను నిలిచాయి. విన్నర్స్ జట్టుకు రూ. 30 వేలు, రన్నర్స్ జట్టుకు రూ. 15 వేల నగదును టీడీపీ నాయకులు ఉమ్మర్‌ఖాన్, శ్రీనివాసులు, రామాంజనేయులు అందించారు.

'అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయండి'

గోరంట్ల, మే 15(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రమైన గోరంట్లలో అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కార్మిక సంఘం నాయకులు తహసీల్దార్ మారుతికి గురువారం వినతిపత్రాన్ని అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇటీవల పట్టణంలోని పోలీస్‌స్టేషన్ వద్ద పట్టపగలే దుస్తుల దుకాణం అగ్ని ప్రమాదం వల్ల కాలిపోయి రూ.లక్షల్లో నష్టం జరిగిందన్నారు. నాసిన్ కంపెనీలోనే గతంలో భారీ అగ్నిప్రమాదం జరిగిన విషయం అందరికీ తెలిసిందేనని వివరించారు. ప్రమాదాలు జరిగినప్పుడు సుదూర ప్రాంతాలనుంచి అగ్నిమాపక యంత్రాలు రావాల్సి వస్తోందని, ఈ నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే పట్టణంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుచేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న, స్వర్ణలత, భవన నిర్మాణ సంఘం కొండా వెంకటేష్, ముద్దల వెంకటరాముడు, మహబూబ్‌బాషా, బాబాజాన్, మగ్బుల్‌బాషా పాల్గొన్నారు.

మట్టి అక్రమ తరలింపును అడ్డుకున్న అధికారులు



చెరువు మట్టిని డంప్ చేస్తున్న ట్రాక్టర్

సోమందేపల్లి, మే 15(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొత్తపల్లి చెరువు నుంచి మట్టిని జేసీబీ ద్వారా ట్రాక్టర్‌లతో సోమందేపల్లిలోని హెచ్‌పి గ్యాస్ గోడౌన్‌వద్దకు మట్టిని తరలిస్తున్న వారిని రెవెన్యూ అధికారులు గురువారం అడ్డుకున్నారు. పట్టణంలోని గ్యాస్ గోడౌన్ వద్ద గుంతలు పూడ్చడానికి ఓ వ్యక్తి మట్టిలోడ్‌లకు సంబంధించి ఓ వ్యాపారితో ఒప్పందం చేసుకున్నాడు. కొత్తపల్లికి చెందిన ఆ వ్యాపారి ఎలాంటి అనుమతులులేకపోయినా చెరువు నుంచి మట్టి తోడి పట్టపగలే రెవెన్యూ కార్యాలయానికి వెళ్లేదారిగుండా పది ట్రాక్టర్లకుపైగా మట్టిని తరలించాడు. సమాచారం అందడంతో ఇన్‌చార్జి తహసీల్దార్ మారుతి పట్టణ వీఆర్‌ఓ నాగరాజును సంఘటనా స్థలానికి పంపారు. మట్టి తరలిస్తున్నవారి వద్ద ఎలాంటి అనుమతులు లేకపోవడంతో నిలుపుదల చేయించారు. చెరువు ఇరిగేషన్‌శాఖ పరిధిలో వస్తుందికాబట్టి అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. చెరువు మట్టిని రైతులు మాత్రమే సొంత ఖర్చులతో తోలుకోవడానికి ప్రభుత్వం అనుమతిచ్చిందన్నారు. వ్యాపార అవసరాలకు కాదన్నారు. అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తే వాహనాలు సీజ్‌చేస్తామని ఇన్‌చార్జి తహసీల్దార్ మారుతి హెచ్చరించారు.

ఇటుక ట్రాక్టర్ బోల్తా... ఇద్దరికి గాయాలు



బోల్తాపడిన ఇటుకల ట్రాక్టర్ ట్రాలీ

హిందూపురం, మే 15(ఆంధ్రజ్యోతి): పరిగి నుంచి ఇటుకలు తీసుకొస్తున్న ట్రాక్టర్ కొడికొండ-శిర జాతీయ రహదారిలోని కొట్నూరు సమీపంలోని ఇందిరమ్మ కాలనీవద్ద బోల్తాపడింది. ఈ ఘటనలో కార్మికులు నాయక్, విజయ్ గాయపడ్డారు. ట్రాక్టర్ ట్రాలీలో ఇటుకలపై కూర్చున్న కూలీలు ట్రాలీ బోల్తాపడగానే ఇరువురు కూలీలు మధ్యలోనే నిలిచిపోయారు. స్థానికులు గమనించి హుటాహుటిన బయటకు తీసి వారిని ఆసుపత్రికి తరలించారు.

ఐదుగురికి జరిమానా

పెనుకొండ రూరల్, మే 15(ఆంధ్రజ్యోతి): రామగిరి మండలంలోని కానికివాండ్లపల్లి గ్రామంలో శివశంకర్‌పై దాడిచేసిన ఐదుగురికి జరిమానా విధించినట్లు ఎస్ఐ నరేంద్ర తెలిపారు. రాచూరు గ్రామానికి చెందిన రోజాతో శివశంకర్‌కు వివాహమైంది. భార్య కాన్పుకోసం పుట్టింటికి వెళ్లగా అప్పుడప్పుడు వచ్చి వెళ్తుండేవాడు. ఈ క్రమంలో 2015ఆగస్టు21న శివశంకర్ అత్త సుశీలమ్మతో ఆరుబయట మాట్లాడుతుండగా అదే గ్రామానికి చెందిన గొల్ల ధనుంజయ, గొల్లరవి, సుధాకర్, పరందామ, బోయ శ్రీరాములు శివశంకర్‌పై అకారణంగా దాడిచేశారు. ఈ విషయంపై అప్పటి ఎస్ఐ దస్తగిరి కేసు నమోదు చేసి కోర్టులో చార్జ్‌షీటు ఫైల్‌చేశారు. పూర్వాపరాలు పరిశీలించి పెనుకొండ కోర్టు న్యాయాధికారి ఒక్కొక్కరికి రూ.6వేలు చొప్పున జరిమానా విధించారు. జరిమానా కట్టని పక్షంలో ఆరు నెలలు జైలుశిక్ష అనుభవించాల్సి ఉంటుందని ప్రిన్సిపల్ జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ న్యాయాధికారి బొజ్జప్ప తీర్పునిచ్చారన్నారు.

సంస్కరణల పేరుతో విద్య నిర్వీర్యం

- ఏపీఎస్‌టీఏ

పెనుకొండ, మే 15(ఆంధ్రజ్యోతి): సంస్కరణల పేరుతో చేస్తున్న అసంబద్ధ, అశాస్త్రీయ నిర్ణయాలతో పాఠశాల విద్య నిర్వీర్యం అయ్యే పరిస్థితులు నెలకొంటున్నాయని స్కూల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంవి కృష్ణారెడ్డి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మారుతిప్రసాద్, జయక్రిష్ణ అసోసియేషన్‌ప్రెసిడెంట్ నరేష్‌కుమార్, మక్కిశెట్టి కుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం ఒక్కో పాఠశాలకు ఒక్కో నిబంధనలు విధించి ఉపాధ్యాయులను కేటాయించడం సరైంది కాదన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందాలంటే అన్ని పాఠశాలలకు ఒకే విధమైన స్టాఫ్ పాటర్న్ ఉండాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిర్ణయాలతో కొన్ని వేల పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారి భవిష్యత్తులో మూసివేసే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వం ఆలోచించి నిర్ణయం తీసుకోవాలన్నారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

గోరంట్ల, మే15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 1వార్డుకు చెందిన వివాహిత జైనాబీ విష ద్రావకం తాగి గురువారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబ సభ్యులు గుర్తించి వెంటనే ఆమెను ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురాగా డాక్టర్ వినోద్‌కుమార్ వైద్య పరీక్షలు జరిపారు. మెరుగైన వైద్యం కోసం 108లో హిందూపురం తరలించారు.

ద్విచక్రవాహనం బోల్తా వ్యక్తికి గాయాలు

అమరాపురం, మే 15(ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని హేమావతి గ్రామానికి చెందిన నారాయణప్పకు గాయాలయ్యాయి. కెంకెర పొన్నం కట్ట చెరువు దగ్గర ద్విచక్రవాహనంలో పోతున్న ఆయన అదుపు తప్పి కిందపడ్డాడు. అటు వెళ్తున్న వాహనచోదకులు గమనించి హేమావతి ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స అందించి తలకు బలమైన దెబ్బలు తగలడంతో మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించారు.